



	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	39.3	21.9
భద్రాద్రి	29.0	18.0

వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలవుతున్నా సరైన వర్షాలు లేకపోవడంతో కృష్ణా బేసిన్‌లోని జలాశయాలు వెలవెలబోతున్నాయి. రాష్ట్ర పరిధిలోని శ్రీశైలం, సాగర్ జలాశయాలు నిండితేనే జిల్లాలోని ఎన్నెస్పీ ఆయకట్టులో వరి సాగు ముందుకు సాగుతుంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇంకా నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు నీరు రాకపోవడవంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది కూడా వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగర్ జలాలు విడుదల కాకపోవడంతో సాగర్ ఆయకట్టులో క్రాప్‌హాలిడే ప్రకటించారు. అడపా దడపా వర్షాలు కురుస్తున్నా వాటివల్ల ప్రాజెక్టుల్లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరడం లేదు.



అడుగంటిన పాలేరు జలాశయం

సాగు సందిగ్ధం

- అయోమయంలో సాగర్ ఆయకట్టు రైతులు
- నారు తరుణం మించి పోతోందని ఆదోళన
- జిల్లాలో 2.50 లక్షల ఎకరాల ఆయకట్టులో వరిసాగు ప్రశ్నార్థకం
- ఉమ్మడి జిల్లాలో ఎన్నెస్పీయేతర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి

నీరు లేక కళతప్పిన జలాశయాలు

కూసుమంచి, జూలై 15: కృష్ణా పరివాహక ప్రాంతాల్లో అల్మట్టి, జూరాల, నారాయణపూర్ ప్రాజెక్టుల్లోకి ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. దీంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు కళతప్పి డెడ్‌స్టోరేజ్‌కు చేరాయి. ఈ ప్రాజెక్టుల్లోకి నీరు రావాలంటే జూలై, ఆగస్టు మాసాల్లో కురిసే వర్షాలపైనే ఆధారపడాల్సి ఉంది. అయితే వారం రోజుల క్రితం అల్మట్టికి సుమారు 80వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ఈ వరద మరో వారం రోజులపాటు కొనసాగి ఉంటే దిగువకు నీరు విడుదల అయ్యే అవకాశం ఉండేది. కానీ ఇన్‌ఫ్లోస్ వెంటనే తగ్గిపోవడంతో అల్మట్టి పూర్తిగా నిండలేదు. వర్షాకాలం ప్రారంభమై నెల పదిహేను రోజులు గడుస్తున్నా ప్రాజెక్టులు వెలవెలబోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టులో ఖరీఫ్, రబీ సీజన్లకు గాను సుమారు 2.50లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. అదేవిధంగా బోర్లు బావులు కింద మరో లక్ష ఎకరాల్లో పలు పంటలు సాగవుతాయి. పాలేరు జలాశయం బ్యాక్‌వాటర్ ఆధారంగా నిర్మితమైన భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా పాలేరు నియోజకవర్గంలో గత ఏడేళ్లుగా మరో 70వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. వర్షాభావం వల్ల ఈ సాగుపై ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రాజెక్టుల్లో నీరు చేరకపోవడంతో ఆయకట్టు పరిధిలో పంటలు సాగవుతాయో లేదోనని అయోమయంలో పడ్డారు. వాస్తవానికి ఆయకట్టులో వరిసాగు చేయాలంటే ఇప్పటికే నారుపోసుకుని ఉండాలి. ఈ నెలాఖరు నుంచి వచ్చే నెలాఖరులోగా నాట్లు పూర్తి చేయాల్సి ఉంది. కానీ ఇంకా ఆయకట్టులో నార్లు పోయకపోవడంతో వరిసాగు సందిగ్ధంలో పడింది. బోర్లు బావుల ఆధారంగా నీటిసౌకర్యం ఉన్న కొందరు రైతులు ధైర్యం నారు పోసుకున్నారు. కానీ సాగర్ సకాలంలో రాకపోతే ఈ రైతులు కూడా నాట్లు వేసే పరిస్థితి ఉండదు.

అగమ్యగోచరం రైతుల పరిస్థితి

సాగర్ ఆయకట్టులో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వర్షాలు లేకపోవడంతో గత ఏడాది పంటలు సాగుచేయక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది కూడా ఇదే పరిస్థితి ఉంటుందేమోనని ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ వర్షాలు ఆశించిన స్థాయిలో కురవక జలాశయల్లోకి నీరు రాకపోతే ఆయకట్టులో నాట్లు పడే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలోని ఎన్నెస్పీయేతర ఆయకట్టులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అరకొరగా కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే బోర్లు బావుల్లో నీరు అడుగంటుతోంది. ఏది ఏమైనా ఈ నెలలో వరుణుడు కరుణించకపోతే మరోసారి రైతులకు నిరాశే ఎదురుకానుంది.

ప్రాజెక్టుల్లో నీటిమట్టాల పరిస్థితి ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ఠ నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం
శ్రీశైలం	885 అడుగులు	813 అడుగులు
నాగార్జున సాగర్	590 అడుగులు	503 అడుగులు
పాలేరు	23 అడుగులు	7.5 అడుగులు
వైరా	18 అడుగులు	7.6 అడుగులు

పథకం వేసి.. ఉసురు తీసి..

- ప్రియురాలి కోసం.. భార్యా, పిల్లలను హత్య చేసిన వైద్యుడు
- గూగుల్‌లో వెతికి మరీ భార్యకు విషపు ఇంజక్షన్..
- ఊపిరాడకుండా చేసి ఇద్దరు కుమార్తెలను హతమార్చిన వైనం
- ఆపై రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్టు చిత్రీకరణ
- కారులో ఇంజక్షన్ దొరకడంతో మలుపు తిరిగిన కేసు
- వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నారని ఘాతుకం
- 45 రోజుల్లో కేసును ఛేదించిన రఘునాథపాలెం పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఖమ్మం ఏసీపీ రమణమూర్తి



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమణమూర్తి, చిత్రంలో నిందితుడు ప్రవీణ్

రఘునాథపాలెం, జూలై 14: ప్రాణాలు కాపాడాల్సిన వైద్యుడే కట్టుకున్న భార్యకు, కడుపున పుట్టిన బిడ్డల పాలిట కాలయముడయ్యాడు. తన వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నారన్న కారణంతో భార్యకు విషపు ఇంజక్షన్ ఇచ్చి హతమార్చాడు. అంతటితో ఆగకుండా ముక్కు, నోరు మూసి ముక్కుపచ్చలారని తన ఇద్దరు కుమార్తెల ఊపిరి ఆపేశాడు. ముగ్గురూ మృతిచెందారని నిర్ధారించుకున్న తరువాత మృతదేహాలను కారులో వేసి ఆ కారును ఓ చెట్టుకు గుద్ది రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాడు. ఖమ్మం జిల్లా రఘునాపథపాలెం మండలంలో కొద్ది రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో తల్లి, ఇద్దరు పిల్లలు మృతి చెందిన ఘటనపై లోతుగా విచారించిన పోలీసులు సాంకేతికత అంశాల ఆధారంగా (మిగతా 7వ పేజీలో)

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి
- ఖమ్మం రూరల్‌లో మహిళా రైతు కూలీలతో ముచ్చట

ఖమ్మం రూరల్, జూలై 14: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందజేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం కొండాపురం, ఆరెంపుల, గూడురుపాడు, తనగంపాడు తదితర గ్రామాల్లో ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అతి త్వరలోనే అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇళ్లు అందిస్తామని ప్రకటించారు. ఆగస్టు 15లోగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. పాలేరు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతి ఒక్కరు తమ ఇంట్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. గ్రామాల్లో మంత్రి పొంగులేటి మొక్కలు నాటారు. కొండాపురం గ్రామం నుంచి గూడురుపాడు వెలుతుండగా మార్గంమధ్యలోని ఎమ్ వెంకటాయపాలెం గ్రామం సమీపంలో మహిళా రైతు కూలీలు పోలంలో పనిచేస్తుండగా మంత్రి కాన్వయ్‌ను ఆపి రైతు కూలీలవద్దకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి రైతు భరోసాపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆరెకోడు గ్రామానికి చెందిన మహిళా రైతు కోంపెల్లి రామనర్సమ్మ మాట్లాడుతూ తాము ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుమని వివరించింది. గత ఐదేళ్లుగా వ్యవసాయంపై ఏమీ మిగలడంలేదని తెలిపింది. కౌలు రైతులకు అన్యాయం జరుగుతోందని, పట్టాదారులకే పథకాలన్నీ అందుతున్నాయని, కౌలు రైతులకు కూడా రైతు భరోసా కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని మంత్రిని కోరింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, మండలాధ్యక్షుడు వెంకటరెడ్డి, మద్ది వీరారెడ్డి, మద్ది మల్లారెడ్డి, ముక్కా శేకర్‌గౌడ్, కేతినేని వేణు, సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, పుచ్చకాయల కమలాకర్, సుధాకర్, రాంమూర్తి నాయక్, సురేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



మహిళా రైతులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

వరద రాకముందే
కరకట్ట పూర్తి చేయాలి

- విస్తా కాంప్లెక్స్ వద్ద అదనపు మోటార్లు సిద్ధం చేయాలి
- భద్రాచలంలో గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్

భద్రాచలం, జూలై 14: గోదావరి వరదలు పెరగక ముందే భద్రాచలం వద్ద కరకట్ట నిర్మాణం పూర్తి చేయాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. భద్రాచలంలో ఆదివారం వరద ప్రభావిత ప్రదేశాలను ఆయన పరిశీలించారు. విస్తా కాంప్లెక్స్ వద్ద వరదలకు సంబంధించిన పంపింగ్ మోటార్లను, వరద ఎక్కువైనప్పుడు గోదావరిలోకి వదిలే కనెక్షన్‌కు సంబంధించిన పరికరాలను పరిశీలించారు. వరద అంచనాను బట్టి అదనపు మోటార్లను సిద్ధం చేసి నీటిని ఎప్పటికప్పుడు గోదావరిలోకి పంపింగ్ చేయాలని సూచించారు. వరద ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలకు సంబంధిత సెక్టోరియల్ అధికారులు ఇప్పటి నుంచే వరద పరిస్థితిని తెలియజేస్తూ ఉండాలన్నారు. వరద పెరిగిన వెంటనే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. పంచాయతీ అధికారులు వర్షాకాలం దృష్ట్యా మురుగు కాలువల్లో మురుగునీరు నిల్వ లేకుండా శుభ్రం చేయాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న కరకట్ట నిర్మాణ ప్రాంతంలో పనుల పురోగతిని అధికారులనడిగి తెలుసుకున్నారు. గోదావరి వరదల పెరగక ముందే కరకట్ట నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, తహసీల్దారు శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు, ఆర్ఐ నరసింహారావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కరకట్ట నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్



మాజీమంత్రి పువ్వాడను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మాజీ మంత్రి అజయ్‌కి
కేటీఆర్ పరామర్శ

ఖమ్మంకార్పొరేషన్, జూలై14: తీవ్రమైన వెన్నునొప్పితో అనారోగ్యం పాలైన మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ పరామర్శించారు. హైదరాబాద్‌లోని పువ్వాడ నివాసానికి బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆదివారం వెళ్లిన కేటీఆర్ ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మెరుగైన వైద్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పంచాయతీల్లో బదిలీల పర్వం

- నేడు విలేజ్ సెక్రటరీల బదిలీ కౌన్సిలింగ్
- ఖమ్మం జిల్లాలో 179, భద్రాద్రిలో 153మందికి అవకాశం
- ఇరు జిల్లాల్లో ఏర్పాట్లు పూర్తి

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం, జూలై 14(ఆంధ్రజ్యోతి): పంచాయతీ సెక్రటరీలకు, ఎంపీవోల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల బదిలీల్లో భాగంగా పంచాయతీరాజ్ విభాగంలోని మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ సెక్రటరీల బదిలీలకు చర్యలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పంచాయతీ సెక్రటరీల బదిలీలకు సంబంధించిన కౌన్సిలింగ్ సోమవారం నిర్వహించనున్నారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 437 పంచాయతీ సెక్రటరీలకు గాను 40శాతం బదిలీల ప్రక్రియలో 179మందికి బదిలీలకు జాబితాను ప్రకటించింది. వీరందరికీ సీనియార్టీ ప్రకారం పోస్టింగులు కల్పించనున్నారు. పూర్తిగా జిల్లా స్థాయిలో ఈ బదిలీలు నిర్వహించన్నుట్లు జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్ తెలిపారు. జిల్లాలో 437 సెక్రటరీలకు గాను 179 మందితో సీనియార్టీ జాబితాను సిద్ధం చేశారు. వీరిలో నలుగురు ఎంపీవోలు, గ్రేడ్-1 సెక్రటరీలు 9, గ్రేడ్ 2 సెక్రటరీలు 8, గ్రేడ్ 3 సెక్రటరీలు 19, గ్రేడ్ 4 సెక్రటరీలు 129తో పాటు బిల్ కలెక్టర్లు ఇద్దరికి బదిలీలకు అర్హత కలిగిఉన్నారు. వీరందరికీ డీపీఆర్సీ భవనంలో కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు. జిల్లాలో ఉన్న ఖాళీల ఆధారంగా సీనియార్టీ ఉన్న వారికి ప్రాధాన్యతకు అవకాశాన్ని కల్పించి పోస్టింగ్ ఇవ్వనున్నట్లు డీపీవో తెలిపారు. ఉదయం 9:30 నుంచి గ్రేడ్ 1, 2, 3 సాయంత్రం గ్రేడ్ 4 సెక్రటరీలకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు మండలాల్లోని గ్రామపంచాయతీ కార్యదర్శులుగా పని చేస్తున్న ఉద్యోగులకు సోమవారం నుంచి బదిలీల పక్రియ ప్రారంభమవుతోంది. దీని కోసం కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 481 పంచాయతీ కార్యదర్శుల్లో 153మంది కార్యదర్శులు బదిలీ కాబోతున్నారు. ఈ మేరకు వారందరూ కౌన్సిలింగ్‌కు రావాలని పంచాయతీరాజ్‌శాఖాధికారులు సమాచారం అందించారు. జిల్లాలో గ్రేడ్-1, 2, 3, సంబంధించిన వారు 16మంది అర్హులుగా ఉన్నారు. గ్రేడ్-4కు చెందిన వారు 134మంది అర్హులుగా ఉన్నారు. మండల పంచాయతీ ఆఫీసర్లుగా(ఎంపీవోలు) ముగ్గురు అర్హులుగా ఉన్నారు. వీరందరికీ నేడు కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు.

క్వారీలు లీజుకివ్వండి!

- రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్‌హెచ్ఏఐ లేఖ
- దేవరపల్లి హైవేకు పెనుబల్లి, గుదిమళ్లలో గుర్తింపు

ఖమ్మం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొనసాగుతున్న పలు జాతీయ రహదారుల నిర్మాణానికి కంకర, మట్టి క్వారీలను గుర్తించి వాటిని తాత్కాలిక లీజు పద్ధతిలో ఇవ్వాలంటూ ఎన్‌హెచ్ఏఐ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. సంబంధిత లేఖలో ఖమ్మం-దేవరపల్లికి జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన మెటీరీయల్ కోసం ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న క్వారీలను గుర్తించినట్టు పేర్కొన్నారు. సంబంధిత రహదారి 2022 నుంచి 2025 వరకు పనులు పూర్తి చేయాల్సి ఉన్న నేపథ్యంలో జిల్లాలోని పెనుబల్లి, ఖమ్మం రూరల్ మండలాల్లో క్వారీలకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. కాగా దేవరపల్లి హైవేలోని మూడు ప్యాకేజీలకు సంబంధించి 31.80 లక్షల మెట్రిక్ టన్నుల కంకర, 54.94 లక్షల మెట్రిక్ టన్నుల మట్టి అవసరం ఉందని అందులో పేర్కొంది. ప్యాకేజీ-1కు గాను 16లక్షల మెట్రిక్ టన్నులు కంకర, 24లక్షల మట్టి అవసరం ఉందని, దానికి సంబంధించి ఖమ్మం రూరల్ మండలంలోని గుడిమళ్లలో సర్వేనెం. 285, 295లో క్వారీకి అనుమతివ్వాలని పేర్కొంది. దాంతోపాటుగా ప్యాకేజీ-2 కుగాను 13 లక్షల మెట్రిక్ టన్నుల కంకర, 20 లక్షల మెట్రిక్ టన్నుల మట్టి, ప్యాకేజీ-3లో 2.80 లక్షల మెట్రిక్ టన్నుల కంకర, 10.94 లక్షల మెట్రిక్ టన్నుల మట్టి అవసరం ఉన్నట్టు వాటిని ఇవ్వాలని కోరింది. కాగా దానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆ బాధ్యతలను సంబంధిత శాఖలకు అప్పగించినట్టు సమాచారం. ఖమ్మం జిల్లా నుంచి పలు జాతీయ రహదారులు రూపుదిద్దుకుంటున్నాయి. గత కొన్ని నెలలుగా జాతీయ రహదారులకు సంబంధించిన పనులు వేగంగా సాగుతున్నాయి. ఖమ్మం నగరానికి నాలుగువైపులా ఈ రహదారులు ఉండటంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఈ రహదారుల పనులు కొనసాగుతున్నాయి. ఇటీవలే మంత్రి తుమ్మల ఆయా రహదారులకు సంబంధించి అవసరమైనచోట ఎంట్రీ, ఎగ్జిట్‌లకు అనుమతులు తీసుకొచ్చారు.



కొత్తగూడెంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి

కొత్తగూడెం ప్రజలకు
పాదాభివందనం

- అత్యధిక మెజార్టీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు
- ఇది నా గెలుపు కాదు.. ప్రజల గెలుపు
- నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా..
- ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి

6

ఒకే భవనం..
రెండు గురుకులాలు

- ప్రహరీ లేని నిర్మాణానికి మూడు వైపులా పొలాలు
- రెబ్బవరంలో ముసలిమడుగు, వైరా మహాత్మా జ్యోతిబాపూలే విద్యాసంస్థలు
- వసతులు సరిపోక బాలికల అవస్థలు
- మెనూ పాటించని నిర్వాహకులు
- ప్రతీ రోజు ఒకే రకం అల్పాహారం

6

‘అల్పాహారం’
అందేనా?

- సర్కార్ స్కూళ్లలో ఆదిలోనే ఆగిపోయిన ‘సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీం’
- అసెంబ్లీ ఎన్నికల ముందు గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభం
- అప్పుడే పూర్తిస్థాయిలో అమలుకాని పథకం
- ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ అమలు చేసేనా?

7



అటానమస్..

భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయంప్రతిపత్తి

- జీడీసీలో సీట్ల కోసం విద్యార్థుల పోటీ
- అందుబాటులో ఆధునిక, సాంకేతిక కోర్సులు
- కేయూ పరిధిలో ఉత్తమ ర్యాంకుల చరిత్ర
- ఉమ్మడి జిల్లాలోనే రెండో కాలేజీగా ఘనత
- జాతీయ గుర్తింపు సంస్థ నాక్ బీ++ గ్రేడ్ సొంతం
- ఏజెన్సీ మణిహారానికి యూజీసీ పెద్దపీట

భద్రాచలం, జూలై 14: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ స్వయం ప్రతిపత్తి హోదా కల్పిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేయడంతో నూతన అధ్యాయం ప్రారంభమైనట్లయింది. 1980 లో సాధారణ డిగ్రీ కళాశాలగా మొదలైంది. అంచెలంచెలుగా ఎదుగుతూ నాక్ బీ++ గ్రేడ్ సాధించింది. పీజీ కోర్సుల నిర్వహణకు సైతం ఇక్కడ క్యాంపస్‌ను కాకతీయ యూనివర్సిటీ నిర్వహిస్తోంది. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి వచ్చి విద్యార్థులు వచ్చి ఇక్కడ డిగ్రీ, పీజీ విద్యనభ్యసిస్తున్నారు. రాష్ట్రంలో మొదటి 20 అత్యుత్తమ కళాశాలల్లో భద్రాచలం డిగ్రీ కళాశాల ఉండటం గర్వించదగ్గ విషయం. ఇక్కడ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కోర్సులను, సంప్రదాయ కోర్సులను సైతం విద్యార్థులకు అందిస్తుండటంతో సీట్ల కోసం పోటీ పడుతుంటారు. ఈ సమయంలోనే ఏజెన్సీ మణిహారంగా ఉన్న ఈ కళాశాలకు యుజీసీ స్వయం ప్రతిపత్తి హోదా కల్పించింది. దీంతో ఇక్కడ విద్యనభ్యసించే విద్యార్థులకు విస్తృత ప్రయోజనాలు అందనున్నాయి.

ఏజెన్సీలో 44 ఏళ్ల ప్రస్థానం...

ఏజెన్సీలో గత 44 ఏళ్లుగా వేలాది మంది విద్యార్థులకు ఉన్నత చదువులను అందించి అత్యున్నత స్థానాలకు చేరేందుకు భద్రాద్రి డిగ్రీ కళాశాల దోహద పడింది. ఈ కళాశాల ఇక నుంచి స్వయం ప్రతిపత్తి హోదాతో అధికారిక కార్యకలాపాలు నిర్వహించనుంది. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజీసీ) నుంచి అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2024-25 నుంచి 2028-29 విద్యా సంవత్సరాలకు గాను ఈ హోదాను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్నో ఉత్తమ ర్యాంకులను వివిధ విభాగాల్లో సాధించింది. కాగా భద్రాద్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా దక్కడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ ఘనత సాధించిన రెండో ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా ఘనతికెక్కింది. కాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తొలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా నిలిచింది. ఈ కళాశాల ప్రస్తుతం జాతీయస్థాయి గుర్తింపు సంస్థ నాక్‌చే బీ++ గ్రేడ్‌తో కొనసాగుతోంది. ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో డిగ్రీ, పీజీ కోర్సుల్లో విద్యనందిస్తున్నారు.

మరిన్ని ప్రయోజనాలు

స్వయం ప్రతిపత్తి ఈ కళాశాలకు రావడంతో ఎన్నో ప్రయోజనాలు కళాశాలకు విద్యార్థులకు లభించనున్నాయి. ఇకపై ఈ కళాశాలలోనే పాఠ్య ప్రణాళికలు తయారు చేసుకోవడం సాధ్యమవుతుంది. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాల తయారీ, మూల్యాంకనం నిర్వహణ లాంటి కీలక అంశాలు ఇక్కడే నిర్వహించనున్నారు. నూతన కోర్సులు ప్రవేశపెట్టేందుకు కళాశాలకే అధికారం దక్కనుంది. ఉన్నత విద్యా శాఖ కమిషనర్ అనుమతితో గవర్నింగ్ బాడీ రూపుదిద్దుకుంటుంది. దీని పర్యవేక్షణలో కళాశాల నిర్వహణ సాగనుంది.

కళాశాల అభివృద్ధికి అడుగులు

ఇప్పటి వరకు విద్యార్థుల నుంచి సేకరించిన ఫీజుల్లో కొంత భాగం కాకతీయ యూనివర్సిటీకి చెల్లించే వారు. అయితే స్వయం ప్రతిపత్తి వస్తే ఆ మొత్తాన్ని కళాశాల అభివృద్ధికే వినియోగించుకునేందుకు వెసులుబాటు లభిస్తుంది. ఇదే కాకుండా విభాగాల వారీగా ఫీజుల నిర్ణయం, స్థానిక అవసరాల రీత్యా ఏవి అవసరమో వాటిని గుర్తించి కళాశాలలో వాటిని ఏర్పాటు చేసేందుకు వీలుంటుంది. పరిసర ప్రాంతాల్లోనిప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ కల్పనకు అవకాశాలున్న కోర్సులను రూపొందించి ప్రవేశపెట్టేందుకు వీలుంటుంది.

అధ్యాపకుల హర్షం...

కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా దక్కడం పట్ల ప్రిన్సిపాల్ డా. కె.జాన్‌మిల్టన్, వైస్ ప్రిన్సిపాల్ భద్రయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటరు, అల్మనీ అధ్యక్షులు డా. వి.కామేశ్వరరావు, అకడమిక్ కోఆర్డినేటరు డా. డి.వీరన్న, టెక్నికల్ కోఆర్డినేటరు డా.ఎస్ శ్యామ్‌ప్రసాద్‌లు హర్షం వ్యక్తం చేశారు. కాగా భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల(జీడీసీ)కి స్వయంప్రతిపత్తి రానుందని 'ఆంధ్రజ్యోతి' ముందుగానే చెప్పడం విశేషం.



నాటి గురువులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

బడి యాదిలో బాల్య మిత్రులు

- 43 సంవత్సరాల తర్వాత కలిసిన స్నేహితులు

వైరా, జూలై 14: వైరా ప్రభుత్వ హైస్కూల్లోని 1980-81 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం వైరాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఆబ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు పెద్ద సంఖ్యలో సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ బ్యాచ్‌కు చెందిన వైరా అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ కొప్పురావూరి వెంకటకృష్ణ, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు ఈ అపూర్వ సమ్మేళన నిర్వహణలో కీలకంగా వ్యవహరించారు. ప్రభుత్వ హైస్కూల్లో ఐదోతరగతి నుంచి పదోతరగతి వరకు తమకు విద్యాబోధన చేసిన నాటి గురువులు మిట్టపల్లి పుల్లారావు, కృష్ణయ్యసూరి, సీహెచ్.కృష్ణారావు, సీహెచ్.మందయ్యలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఆటపాటలతో అలరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. రాయల నాగేశ్వరరావు, లగడపాటి నెహ్రూ, ఊరుకొండ శ్రీనివాసరావు, అనుమోలు శ్రీనివాసరావు, కొత్తా శ్రీనివాసరావు, ధార్న వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



గత సంవత్సరం పెద్దసరిగెత్తు ముందు రోజు రాత్రి కరకగూడెంలో అగ్ని గుండం చుట్టూ అసేయ్ దులా అంటూ ఉత్సాహంగా భక్తులు..

సవార్లు.. సైదులా.. అసేయ్ దులా..

- సరిగెత్తుల రూపంలో జరగనున్న వేడుకలు
- కరకగూడెంలో కొలువు తీరిన పీరీలు
- నేడు చిన సరిగెత్తు వేడుకలు
- అత్యంత వైభవంగా జరగనున్న మొహర్రం వేడుకలు

కరకగూడెం, జూలై 14: సరిగెత్తుల రూపంలో సవార్ల వేడుకలు అత్యంత వైభవంగా జరగనుంది. జిల్లా కరకగూడెం మండలంలోని కరకగూడెంలో పీరీల పండుగ కన్నుల పండువగా జరుగుతోంది. మొహర్రం పండుగ సందర్భంగా జరిపే ఈ ఉత్సవాలు అంబరాన్నంటుతాయి. మండల కేంద్రంలోని కరకగూడెం గ్రామంలో మొహ్రారం(పీరీలు) పండుగా సందర్భంగా మూజావారులు కఠిన నిష్టతో నెలపొడుపు చూసిన తరువాత పీరీల దర్గ (గుడి) వద్ద ఒక్క పొద్దులతో పీరీలను కొలువు తీర్చుతారు. ఈ సందర్భంగా పీరీలను కొలువు తీరిన నాటినుంచి పీరీలను ఎత్తుకునే వారు(మూజావర్లు) గ్రామాలలో దట్టీలు, మలీద, బెల్లం పానకం, సాంబ్రానితో నైవేద్యాలతో భక్తులు మొక్కులను చెల్లించుకుంటారు. ఆరు రోజుల పాటు సవర్లాను కొలువు తీర్చిన తరువాత ఏడోవ రోజు తెల్లవారు జామున చిన సరిగెత్తు, తొమ్మిదోవ రోజున పెద్దసరిగెత్తు రూపంలో పీరీల పండుగను అంగరంగ వైభవంగా ముజావార్లు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దర్గ(గుడి) వద్ద అగ్ని గుండం ఏర్పాటు చేసి కట్టెలతో గుండంలో నిప్పులు ఉంచేలా చూస్తారు. సరిగెత్తు నాడు పీరీలను ఎత్తుకునే ముజావార్లు పూనకాలతో అగ్ని గుండంలో దాటుతారు. అనంతరం భక్కుల కోర్కెలను తీర్చుతారు.



కర్రలు నిర్వహిస్తున్న ముజావర్లు

కొలువు తీరిన సవర్లు, నేడు చినసరిగెత్తు

దర్గ వద్ద సోమవారం సవర్లను మూజవార్లు భక్తి శ్రద్దలతో కొలువు తీర్చారు. ఐదు రోజలుగా పీరీలను కొలువు తీర్చి.. ముజవార్లు 15వ తేదీ సోమవారం తెల్లవారున ఉదయం చీకటితో ఆరు పీరీలను మాత్రమే నిదుర లేపడం భక్తులకు మొక్కులను చెల్లించి చిన్నసరిగెత్తుగా నిర్వహిస్తారు. 17వ బుధవారం తేదిన ఉదయం చికటితో పీరీలను మొత్తం నిదురలేపి అగ్ని గుండంలో తిరుగుతారు. అనంతరం భక్తులకు కోర్కెలకు తీర్చుతారు. సాయంత్రం గ్రామాలలో ఊరేగింపు నిర్వహిస్తారు.

ఈ సందర్భంగా గ్రామస్థులు నీలు ఆరపోసి మొక్కులు చెల్లించుకుంటారు. సవార్ల వేడుకలను చూసేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు ఖమ్మం జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఇక్కడ చేరుకుని మొక్కులు చెల్లించుకుంటారు.

నూతన న్యాయ చట్టాల అమలుతో..

ప్రమాదంలో భావ వ్యక్తీకరణ

- కొన్ని కేసుల్లో పోలీసులకే విస్తృత అధికారం
- సీనియర్ న్యాయవాది విద్యాసాగర్‌రెడ్డి

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 14: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన న్యాయ చట్టాల ద్వారా భావ వ్యక్తీకరణకు ప్రమాదం ఏర్పడిందని, ప్రశ్నించే తత్వాన్ని తొలగించేలా చట్టాలను రూపొందించారని ప్రముఖ సీనియర్ న్యాయవాది విద్యాసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం సీపీఐ జిల్లా సమితి కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన 'నూతన న్యాయ చట్టాలు అమలు-సమాజంపై ప్రభావం' సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృతమైన అధికారం ఇవ్వటం ద్వారా ప్రజాస్వామ్య హక్కులపై ప్రభావం పడుతుందన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చట్టాలను రూపొందించటానికి 43గంటల సమయం కేటాయించారని ప్రతిపక్షాల సలహాలు తీసుకోలేదని విమర్శించారు. చట్టాల వెనుక బీజేపీ విధానాలో పరోక్షంగా కనిపిస్తున్నాయని ఆరోపించారు.



మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది విద్యాసాగర్

పార్లమెంట్‌లో విపక్షాలను బయటకు పంపి ప్రతిష్టాత్మకమైన న్యాయ చట్టాలను ఎందుకు అమోదించారో కేంద్ర ప్రభుత్వం సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. చట్టాలు అమలు ద్వారా ఏర్పాడే దుష్పరిణామాలను పరిగణించలేదన్నారు. దేశ ద్రోహం వంటి కేసులను పరోక్షంగా ప్రవేశ పెట్టారని ఆరోపించారు. సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో నాయకులు నాయకులు దండి సురేశ్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్‌కే జానిమియా, కనకం జనార్దన్, లతీఫ్, శింగు నర్సింహారావు, న్యాయవాది ఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల నుంచి మమ్మల్ని

మినహాయించండి

- అర్చకులకు బదిలీలు ఆగమశాస్త్ర విరుద్ధం
- భద్రాద్రి ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు వైదిక సిబ్బంది వినతి
- ఫోన్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తెచ్చిన ఎమ్మెల్యే

భద్రాచలం, జూలై 14: 'మా పడికట్టు వేరు.. ఆలయాల అర్చకుల బదిలీలు ఆగమశాస్త్ర విరుద్ధం.. బదిలీల నుంచి మమ్మల్ని మినహాయించండి..' అంటూ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అర్చకులు, వైదిక సిబ్బంది భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ఈ విషయాన్ని మంత్రులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. .దేవాలయ అర్చకులకు స్వయంభువ దేవతామూర్తులకు ఏ ఆగమంను అనుసరించి పూజా కార్యక్రమాలు ప్రారంభిస్తారో ఆ ఆగమాల్ని అనుసరించి పూజలు నిర్వహించే అర్చకులు మాత్రమే అక్కడ సేవలు నిర్వహించాల్సి ఉంటుందని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం వైదిక సిబ్బంది పేర్కొన్నారు. ఏ వంశాలకు చెందిన అర్చకులు సేవలు నిర్వహిస్తున్నారో ఆ వంశాలకు చెందిన వారే అర్చక సేవలను నిర్వహించాలని ఆగమశాస్త్రాలు శాసిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అలాగే అర్చకుడిగా ఏ ఆగమమును అనుసరించి దీక్ష నిర్వహించి పూజలు నిర్వహిస్తారో అదే విధానంతో అర్చకులు పూజలు జరపాలని ఒక వేళ ఏమైనా కారణాల వలన వేరే పద్ధతిలో అర్చకున్ని మార్చాల్సి వస్తే మళ్లీ ఆలయానికి పునఃప్రతిష్ఠ జరపాలని ఆగమశాస్త్రం పేర్కొంటోందన్నారు. ఈ నేపథ్యంలో భద్రాద్రి దేవస్థానంలోని అర్చకులకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ నేపధ్యంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అర్చకుల పరిస్థితిని వివరించారు. ఈ క్రమంలో ఈ విషయంను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపినట్లు సమాచారం.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న అర్చకులు

భద్రాచలం అర్చకుల ప్రత్యేకత ఎంతో ..

భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామికి పూజలు నిర్వహించే అర్చకులకు ఎంతో ప్రత్యేకత ఉంది. దానికి కారణం ఆనాడు భద్రాచలం ఆలయాన్ని నిర్మించిన భక్తరామదాసు అమరవాది, పొడిచేటి, కోటి, తూరుగోటి , గొట్టిపుళ్ల అనే ఐదు ఇంటి పేర్లు కల వారిని శ్రీరంగం, కంచి నుంచి శ్రీ పాంచరాత్రాగమంలో నిష్ణాతులైన వారిని తీసుకొచ్చి స్వామి వారికి నిత్య పూజాది కార్యక్రమాలు నిర్వహించేలా నియమించారు. నాటి నుంచి ఆ వంశాలకు చెందిన వారే ఇక్కడ పూజలు నిర్వహిస్తున్నారు. ఈ దిశగా ఎక్కడా లేని ఓ ప్రత్యేకత భద్రాచలం అర్చకులకు ఉందని వారు తెలియజేస్తున్నారు.

ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ ఏర్పాటు

ఖమ్మంకార్పొరేషన్, జూలై14: వారం రోజులు అధిక వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరు ఏదైనా ఇబ్బంది ఉంటే హెల్ప్‌లైన్ నెంబరు 7901298265 కు కాల్ చేయాలని పేర్కొన్నారు.

పెరిగిన వైరా నీటిమట్టం

వైరా, జూలై 14: వైరా రిజర్వాయర్ నీటిమట్టం ఆదివారం ఉదయానికి 7.6అడుగులకు చేరింది. క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాలతో వరదనీరు వచ్చి చేరింది. శనివారం నాటికి 7అడుగులుగా ఉన్న నీటిమట్టం ఆదివారం నాటికి 7.6అడుగులకు చేరుకుంది

భద్రయ్య పంటచేనులో హద్దుల ఏర్పాటు

కారేపల్లి, జూలై14: మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని హల్యాతండావద్ద గల పంటచేలో రైతు భద్రయ్య కుటంబసభ్యులు ఆదివారం హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల రైతు భద్రయ్య చెందిన పంటచేను 1ఎకరం 20కుంటలు భూమిని వరంగల్ జిల్లకు చెందిన మాజీ ఆర్‌ఐ కబ్జాకు పాల్పడ్డాడు. అయితే తన భూమి సదరు మాజీ ప్రజాప్రతినిధి కబ్జాకు పాల్పడిన్నట్లు పలుమార్లు అధికారుల దృష్టికి, ప్రజాప్రతినిధులవద్దకు వెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. కాగా వారం రోజులకి ఆ చేనులో దుక్కి దున్నేందుకు ప్రయత్నించగా, రైతును అడ్డుకున్నారు. భూమిలో నుంచి బయటకు నెట్టివేయడంతో మనస్తాపానికి గురై చేనులోనే పురుగులమందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటంబసభ్యులు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.



చేనులో హద్దులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఈవిషయం తెలసుకున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తన క్యాంపు కార్యాలయంలో ఇరువర్గాలతో మాట్లాడి కబ్జాకు గురైనభద్రయ్య భూమిని ఇప్పించారు. దీంతో రైతు కుటుంబసభ్యులు గ్రామంలోని పెద్దమనుషలతో వెళ్లి తన పంటచేలో హద్దులు ఏర్పాటుచేసుకున్నారు.

ఒకే భవనం.. రెండు గురుకులాలు

- ప్రహరి లేని నిర్మాణానికి మూడు వైపులా పొలాలు
- రెబ్బవరంలో ముసలిమడుగు, వైరా మహాత్మా జ్యోతిబాపూలే విద్యాసంస్థలు
- వసతులు సరిపోక బాలికల అవస్థలు
- మెనూ పాటించని నిర్వాహకులు
- ప్రతీ రోజు ఒకే రకం అల్పాహారం
- పురుగుపట్టిన దొడ్డు బియ్యంతో భోజనం
- శిథిలావస్థలో స్నానాల గదులు, మరుగుదొడ్లు

వైరా, జూలై 14: మహాత్మా జ్యోతిబాపూలే, బీసీ గురుకులాల నిర్వహణలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వైరా మండలంలోని రెబ్బవరంలో ఏర్పాటుచేసిన రెండు బీసీ గురుకుల బాలికల పాఠశాలలు సజీవ సాక్ష్యంగా ఉన్నాయి. మూతపడిన ఒక హైస్కూల్ భవనంలో 749మంది విద్యార్థినులతో రెండు బీసీ బాలికల గురుకుల పాఠశాలలను నిర్వహిస్తూ విద్యార్థినులు వారి తల్లిదండ్రుల సహనాన్ని పరీక్షిస్తున్నారు. ఇంతమంది విద్యార్థినులు ఉన్న ఈ గురుకుల భవనం చుట్టూ కనీసం కాంపౌండ్‌వాల్ కూడా లేదు. మూడువైపులా పొలాలు ఉన్నాయి. కనీస రక్షణ లేకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ముసలిమడుగు పేరుతో ఉన్న బీసీ బాలికల గురుకులాన్ని ఆరేళ్ల కిందట ప్రారంభించారు. ఆగురుకులం తరగతులు ఇప్పుడు పదోతరగతి వరకు పెరిగాయి. మూడేళ్ల కిందట వైరా పేరుతో మంజూరైన బీసీ బాలికల గురుకులాన్ని కూడా ఇదే భవనంలో ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ముసలిమడుగు గురుకులంలో 430, వైరా గురుకులంలో 319మంది విద్యార్థినులు ఉన్నారు.



రెండు గురుకులాలు నిర్వహిస్తున్న భవనం



అధ్వానంగా ఉన్న బాత్‌రూంలు

749మందికి ఒక్కటే కిచెన్, డైనింగ్

ముసలిమడుగు, వైరా పేరుతో రెండు గురుకులాలు ఉన్నప్పటికీ ఈ రెండింటిలోని 749మంది విద్యార్థినులకు ఒకేచోట వంట, ఒకేచోట భోజనాలు వడ్డిస్తున్నారు. ఫలితంగా భోజనాల సమయంలో విద్యార్థినులు నిలబడే పరిస్థితి కూడా లేదు. అంతేకాకుండా తరగతి గదులే విద్యార్థినులకు వసతిగా ఉన్నాయి. పగలు తరగతులు, రాత్రి అక్కడే నిద్రించటం జరుగుతుంది. ఆగదుల్లోనే తరగతులకు సిద్ధం కావల్సిన పరిస్థితి ఉంది. తమ సామగ్రిని తరగతి గదుల్లోనే భద్రపర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

అధ్వానంగా స్నానాల గదులు, మరుగుదొడ్లు

గతంలో ఒక మతసంస్థకు చెందిన హైస్కూల్ భవనంలో అప్పట్లో స్నానాల గదులు, మరుగుదొడ్లు పరిమిత సంఖ్యలో నిర్మించారు. హైస్కూల్ సామర్థం మేరకే విద్యార్థినులు ఉన్నందున వారి అవసరాలను ఇవి తీర్చేవి. అయితే ఇప్పుడు రెండు గురుకులాలు ఇక్కడే ఏర్పాటుచేయటం, 749మంది విద్యార్థినులు ఉండటంతో స్నానాల గదులు, మరుగుదొడ్లు ఏమూలకు సరిపోవడం లేదు. ఉన్నవి కూడా శిథిలావస్థలో ఉన్నాయి. తరగతులకు సిద్ధమయ్యే విద్యార్థులు వాటి ముందు బారులు తీరి నిలబడాల్సిన దుస్థితి నెలకొంది.

పురుగుపట్టిన దొడ్డుబియ్యం..

ఈ గురుకులాల విద్యార్థినులకు సరఫరా చేసిన బియ్యం పురుగులు పట్టి ఉన్నాయి. అవి కూడా దొడ్డురకం బియ్యం మొత్తం మెరిగలు, పురుగులతో అధ్వానంగా ఉన్నాయి. ఆబియ్యంతోనే చేసిన భోజనాలను విద్యార్థినులు తినాల్సిన పరిస్థితి ఉంది. అల్పాహారం కూడా రోజు ఒకేరకం పెడుతున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆహార పదార్థాల్లో మెనూను అమలుచేయడం లేదని విమర్శిస్తున్నారు. ఈ సమస్యలపై శనివారం విద్యార్థినుల తల్లిదండ్రులు కొన్నిగంటలపాటు ఆందోళన నిర్వహించారు. ఆదివారం సీపీఎం నాయకులు, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు ఆగురుకులాలను సందర్శించి ఇక్కడి అధ్వాన పరిస్థితిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే కనీస మౌలిక వసతులు సమకూర్చాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, వారు డిమాండ్ చేశారు.

కొత్తగూడెం ప్రజలకు పాదాభివందనం

కొత్తగూడెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెం నియోజకవర్గ ఓటర్లు పార్లమెంట్ పరిధిలోనే 75 వేల ఓట్ల అత్యధిక మెజార్టీని ఇచ్చి గెలిపించారని నియోజకవర్గ ప్రజలందరికీ పాదాభివందనాలు అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. ఇది నా గెలుపు కాదు.. పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల గెలుపన్నారు. ఆదివారం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఖమ్మం జిల్లా చరిత్రలోనే నియోజకవర్గంలో 4.67లక్షల ఓట్ల మెజార్టీతో తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపించిన ఘనచరిత్ర మరిచిపోలేనిదన్నారు. కొత్తగూడెం రైల్వేస్టేషన్‌లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కొవిడ్ సమయంలో ఈ రైల్వేస్టేషన్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే మూడు రైళ్లను అధికారులు నిలిపివేసిన విషయాన్ని పలువురు ప్రయాణీకులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో భద్రాచలం రోడ్ నుంచి డోర్నకల్, మణుగూరు నుంచి కాజీపేట, బెల్లం రైల్వే ఎక్స్‌ప్రెస్‌లు ప్రస్తుతం నడవడం లేదని వాటన్నింటిని పునరుద్ధరించేందుకు సౌత్‌సెంట్రల్ రైల్వే అధికారులతో మాట్లాడుతానన్నారు. రైల్వేస్టేషన్ సమీపం నుంచి త్రీటౌన్ సెంటరు నుంచి హేమచంద్రాపురం మీదుగా ఇల్లెందు వెళ్లే రోడ్డు చాలా ఇరుకుగా ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు తన దృష్టికి తెచ్చారన్నారు. ఈ రోడ్డు విస్తరణ కోసం రైల్వేకు సంబంధించిన భూమి కొంత అవసరం ఉన్న దృష్ట్యా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ద్వారా సౌత్‌సెంట్రల్ రైల్వే అధికారులతోపాటుగా కేంద్ర రైల్వేశాఖమంత్రిని కలిసి రోడ్డు విస్తరణ కోసం రైల్వే భూమిని ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లాలోని సింగరేణి సంస్థ బొగ్గుబావులను ప్రైవేటీకరణ చేయకుండ సింగరేణి సంస్థే బొగ్గు తవ్వకాలు చేపట్టేందుకు కేంద్ర బొగ్గుమంత్రిత్వశాఖతో మాట్లాడి ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు విషయంలో కూడ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన చేస్తానన్నారు. జిల్లాలో కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుంటానన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములు, జిల్లా మహిళ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, జిల్లా నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని), ఆళ్ల మురళీ పాల్గొన్నారు.

పథకం వేసి..ఉసురు తీసి..

(5వ పేజీ తరువాయి)

కేసును చేధించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ప్రియురాలు చెప్పినట్టు తన భార్యను, పిల్లలను అడ్డు తొలగించుకునేందుకు భర్తే ఈ దారుణానికి ఒడిగట్టినట్టు తేల్చారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఖమ్మం నగర ఏసీపీ రమణమూర్తి ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం రామ్‌నగర్‌కు చెందిన కుమారి(28)కి రఘునాథపాలెం మండలం బావోజీతండాకు చెందిన డాక్టర్ బోడా ప్రవీణ్‌తో 2019లో వివాహం జరిగింది. డాక్టర్ ప్రవీణ్ హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అనస్థీషియా వైద్యుడిగా పనిచేస్తుండగా, కుమారి అక్కడే గృహిణిగా ఉండేది. వీరికి కృతిక(3), క్రుషిక (5)అనే కుమార్తెలున్నారు. ఆసుపత్రిలో రాత్రి సమయంలో విధులు నిర్వహించే ప్రవీణ్‌కు అక్కడే విధులు నిర్వహిస్తున్న కేరళకు చెందిన సోనీ ఫ్రాన్సిస్ అనే యువతితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయం అతడి భార్య కుమారికి తెలియడంతో వారి మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ క్రమంలో ఇరుకుటుంబాలు పంచాయితీలు నిర్వహించి వారికి నచ్చజెప్పి పంపించేవారు. అయితే ప్రవీణ్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న యువతి సోనీ ఫ్రాన్సిస్ తమ సంబంధానికి ప్రవీణ్ భార్య, పిల్లలు అడ్డొస్తున్నారని భావిం చి వారిని అడ్డు తొలగించుకుని వస్తే ఇద్దరం ప్రశాంతంగా ఉండొచ్చని చెప్పడంతో ఇద్దరూ కలిసి వారిని హతమార్చేందుకు పథకం రచించారు.

విషపు ఇంజక్షన్ కోసం గూగుల్‌లో సెర్చ్....

భార్యా పిల్లలను హతమార్చాలని నిర్ణయించుకున్న డాక్టర్ ప్రవీణ్ ఇంటి వద్ద పనులు ఉన్నాయని మే నెలలో పది రోజులుపాటు సెలవు పెట్టి భార్య, పిల్లలతో స్వగ్రామం బావోజీతండాకు వచ్చాడు. ఇంటికి


కుమారి, చిన్నారులు కృతిక, క్రుషిక(ఫైల్)

వచ్చిన తర్వాత భార్య పిల్లలను హత్య చేసేందుకు కసరత్తు చేశాడు. ఈ క్రమంలో విషపు ఇంజక్షన్‌తో చంపాలని నిర్ణయించుకొని తరువాత ఏ ఇంజక్షన్ అయితే శరీరంలో కలిసిపోతుందోనని గూగుల్‌లో వెతికి మరీ హత్యకు ప్రణాళిక సిద్ధం చేశాడు. ఇదే సమయంలో ఒక రోజు భార్య కుమారి తన శరీరం వేడిగా ఉందని, వైద్యం చేయాలని భర్తను కోరింది. దాంతో మే 26న క్యాల్షియం ఇంజెక్షన్ ఇస్తానని అతడు చెప్పాడు. అయితే అప్పటికే తనకు వేడి తగ్గిందని కుమారి చెప్పడంతో ఆ రోజు తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. మరో రెండు రోజుల తర్వాత ఖమ్మంలో ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయాలని భార్య, బిడ్డల్ని తీసుకొని తన కారులో ఖమ్మానికి వచ్చి తిరిగి ప్రయాణమయ్యాడు. ఆ సమయంలో కుమారి మళ్లీ తనకు అనారోగ్యంగా ఉందని చెప్పడంతో మార్గమధ్యంలో బల్లేపల్లి సెంటర్‌లో ఓ మందుల దుకాణం వద్ద కారు ఆపిన ప్రవీణ్ కాల్షియం ఇంజక్షన్‌తో పాటుగా మరో ఇంజెక్షన్ కొనుగోలు చేశాడు. తర్వాత కారును మూడు కిలోమీటర్ల దూరం తీసుకెళ్లి కొయచెలక సమీపంలోకి వెళ్లిన తర్వాత వెనుక సీటులో భార్యను పడుకోబెట్టి కాల్షియం ఇంజక్షన్‌తో పాటుగా తాను ముందుగా వేసుకున్న పథకం ప్రకారం విషపు ఇంజక్షన్ ఇవ్వడంతో కుమా రి స్పృహ కోల్పోయి కారు వెనుక సీటులో పడిపోయింది. తర్వాత తన ఇద్దరు కన్నకుమార్తెలను ఫీజియోథెరపీ విధానంతో ఒకరి తర్వాత మరరొకరిని నోరు, ముక్కు మూసి శ్వాస ఆడకుండా చేసి హత్య చేశాడు. ముగ్గు రూ చనిపోయారని నిర్ధారించుకున్న తరువాత కారును తమ సొంత గ్రామానికి వెళ్లే దారిలో మంచుకొండ వద్ద రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు పిల్లలు ఉన్నవైపు కారు ఢీ కొట్టించి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాడు.

కారులో దొరికిన ఖాళీ సిరంజ్ ఆధారంగా....

తమ కుమార్తె కుమారి, ఆమె పిల్లల మృతిపై అనుమానం వ్యక్తం చేసిన మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు కారులో దొరికిన ఖాళీ సిరంజ్‌తో పలు ఆధారాలను సేకరించారు. భార్య కుమారి చేతిపై ఇంజెక్షన్ ఇచ్చిన మచ్చలు కనిపించాయి. వీటిని ఫోరెన్సిక్‌కు పంపిన పోలీసులకు కీలక ఆధారం దొరికింది. అందులో విషపు డ్రగ్ ఉన్నటు ఫోరెన్సిక్ నిపుణులు తేల్చారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించడంతో నేరాన్ని అంగీకరించాడు. దాంతో నిందితుడు డాక్టర్ ప్రవీణ్‌ను ఏ-1, అతడి ప్రియురాలు సోని ఫ్రాన్సిస్‌ను ఏ-2గా పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా కేసును ఛేదించిన రఘునాథపాలెం సీఐ తుమ్మలపల్లి శ్రీహరిని, పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

45రోజులుగా బాధితుల పోరాటం....

కుమారి, చిన్నారుల మృతిపై అనుమానం వ్యక్తం చేసిన ఆమె తల్లిదండ్రులు మృతిచెందిన రోజే ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. తన కుతురు, పిల్లల మృతిపై అనుమానాలున్నాయనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తర్వాత వారం రోజులకు రఘునాథపాలెం పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్ నుంచి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలను అందించారు. రఘునాథపాలెం పోలీసుస్టేషన్‌లో మృతురాలి సోదరి ఎస్ఐ కాళ్లమీద పడి కన్నీరు పెట్టింది. ఇలా 45 రోజులుగా వారు నిర్వీరామ పోరాటం చేశారు. చివరికి పోలీసులు ఈ కేసును ఛేదించడంతో వారి పోరాటం ఫలించింది.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో

ఖమ్మం జిల్లా జట్టుకు తృతీయ స్థానం


తృతీయ బహుమతి సాధించిన జిల్లా బాలికల జట్టు

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 14: ఆదివారం కల్వకుర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సబ్ జూనియర్ బాలికల జట్టు సత్తాచాటింది. పోటీల్లో ప్రతిభ చూపి తృతీయ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీల్లో బహుమతి సాధించిన జట్టు క్రీడాకారులను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కళ్యాణపు ఆదర్శ్‌కుమార్, పలు క్రీడా సంఘాల బాధ్యులు అభినందించారు.

సత్తుపల్లిరూరల్, జులై14: మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి బాలికల సబ్ జూనియర్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలలో ఖమ్మం జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. సత్తుపల్లి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు కే.ధనవర్ష, టీ.తనూశ్రీలు ఖమ్మం జట్టు సాధించిన విజయాలలో కీలకభూమిక ప్రదర్శించినట్లు పీడీ చీకటి శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను హెచ్ఎం నీరుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, ట్రైనర్ నోయల్ జాక్సన్‌లు అభినందించారు.

ఆలయంలో పట్టపగలే చోరీకి యత్నం

● దోచుకున్న వెండితో ఓదొంగను పట్టుకున్న యువకులు

నేలకొండపల్లి, జూలై14: నేలకొండపల్లిలోని అతి పురాతనమైన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం పట్టపగలే నలుగురు దొంగతనానికి ప్రయత్నం చేశారు. వెండి సామాన్లు మూట గట్టుకుని పోతుండగా అనుమానించిన ఇరువురు యువకులు ఆపి ప్రశ్నిస్తుండగా, వాళ్లను నెట్టివేసి స్కూటీపై పారిపోతుండగా వారిలో ఒకడిని యువకులు పట్టుకుని పోలీసులకు


ఈవో సమక్షంలో పంచనామా చేస్తున్న పోలీసులు

అప్పగించారు. దొంగతనానికి వచ్చిన నలుగురిలో ఇద్దరు యువతులు ఉండటం విశేషం. వివరాల ప్రకారం.. ఆదివారం పట్టణంలో గంగమ్మ జాతర జరుగుతుండటంతో వేంకటేశ్వరస్వామి దేవాలయం చుట్టుపక్కల ప్రాంతం జన సంచారం ఎక్కువగా ఉండింది. జాతర చూడటానికి వెళ్లిన నేలకొండపల్లికే చెందిన బూతం ఉమామహేశ్వరరావు ఎలియాస్ నాని, మధ్యాహ్నం సమయంలో గుడి ముందు అనుమానాస్పదంగా ఉన్న యువతితో పాటుగా మరో బాలుడిని గమనించి వారిని ప్రశ్నించాడు. తమది ఖమ్మం లోని వైఎస్ఆర్ కాలనీ అని, డంపింగ్ యార్డులో చెత్త తగులబెట్టటానికి వచ్చామని చెప్పారు. వర్షం పడుతుంటే చెత్తను తగులబెడదామని ఎలా వచ్చారు? అసలు మిమ్మల్ని ఎవరు పిలిచారు?అంటూ ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పడంతో పాటుగా ఓవ్యక్తి గుడి వెనుక భాగాన ఉన్న స్కూటీని తీసుకు రావటానికి వెళ్లడంతో అనుమానం బలపడింది. గట్టిగా నిలదీయడంతో అక్కడే ఉన్న యువతి నానిపై ఎదురు తిరగడం ప్రారంభించింది. ఈలోపులో మిగిలిన వారు కూడా రావడం, అతడిపైకి రావడం, అటువైపుగా వెళుతున్న తోట ఉపేందర్ గమనించి నానీ దగ్గరకు వచ్చి విషయం తెలుసుకుని, ఇరువురు కలిసి వారిని నిలదీశారు. దీంతో దొంగతనానికి వచ్చిన వ్యక్తులు స్కూటీపై పారిపోవటానికి ప్రయత్నించగా వారు వెంట పడటంతో పాటుగా, వెనుక కూర్చున్న బాలుడిని లాగడంతో అతడు కిందపడ్డాడు. వెంటనే అతడిని పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుడిలోకి వెళ్లి చూడగా గుడి వెనుక వైపు తలుపు తాళం పగులగొట్టి ఉండటంతో దొరికిన వ్యక్తిని గట్టిగా నిలదీయడంతో గుడి ఆవరణలోనే మూటగట్టి దాచిన వెండి వస్తువులను చూపించాడు. పోలీసులు వచ్చి బాలుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పారిపోయిన ఇద్దరు యువతులు, యువకుడి కోసం గాలిస్తున్నారు.

క్లూస్‌టీం దేవాలయంలో వేలి ముద్రలు సేకరించింది. దేవాలయం బయట ఉన్నవే తప్ప, వేరే వస్తువులను ముట్టుకోలేదని తెలుస్తున్నది. దొంగలు మూటగట్టిన వెండి వస్తువులను ఆలయ ఈవో సమక్షంలో ఎస్ఐ తోట నాగరాజు పంచనామా నిర్వహించారు.. ఈవో శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో రూ.2.72 లక్షలకు కుచ్చుటోపి

● ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మోసం

● పోలీసులకు ఫిర్యాదు

ఇల్లెందుటౌన్, జూలై 14: ఆన్‌లైన్‌లో డబ్బులు వస్తాయనడంతో ఓ వ్యక్తి నమ్మి మోసపోయాడు. వివరాల ప్రకారం.. ఇల్లెందు పట్టణంలో 24 ఏరియా, సుపర్‌బజార్ ప్రాంతానికి చెందిన ఆర్. ధీరజ్ అనే యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చి న మెసేజ్‌పై క్లిక్ చేశాడు. వెంటనే ఆ సెల్‌ఫోన్ నెంబర్‌కు ఓ సైబర్‌నేరస్థుడు ఫోన్ చేసి ముందు కొంత పెట్టుబడి పెడితే, మీకు ఎక్కువ నగదు జమ అవుతుందని చెప్పాడు. దీంతో వారికి రూ.2.72లక్షలు చెల్లించాడు. డబ్బులు చెల్లించి నాలుగు రోజులు గడిచినపట్టికీ, తనకు తిరిగి డబ్బులు రాకపోవడంతో మోసపోయానట్లు గమనించి ధీరజ్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ బత్తుల సత్యనారాయణ సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దుమ్ముగూడెం, జూలై 14: మండల పరిధిలోని రామారావుపేటకు చెందిన కుర్సం చిన్నారావు(45) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈనెల 3వ తేదీన క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు అదే రోజు 108 వాహనంలో భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. కాగా అతడి మృతుడికి కుటుంబ కలహాలే కారణమని తెలుస్తోండగా, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య, పిల్లలున్నారు. కాగా ఈవిషయమై మృతుడి బంధువులు పోలీసులకు సమాచారం అందించారు.

టీసీలు తీసుకున్న 27మంది విద్యార్థులు!

» పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడమే కారణం

» కుర్నపల్లి పాఠశాలలో ఘటన

» హాస్టల్‌లో జాయిన్ అవ్వుతామంటేనే టీసీలు ఇచ్చాం: హెచ్ఎం

చర్ల, జూలై 14: చర్ల మండలంలోని కుర్నపల్లి ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాల్లో వింత పరిస్థితి ఏర్పడింది. ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడం, కొత్త టీచర్లు రాకపోవడంతో విద్యార్థులు టీసీ(బదిలీ సర్టిఫికెట్)లు తీసుకుంటున్నారు. గత నెల నుంచి ఇప్పటి వరకు 5,6,7, చదువుతున్న 27 మంది విద్యార్థులు టీసీలు తీసుకున్నట్లు తెలుస్తోంది. వీరిలో కొంత మంది హాస్టల్స్ వెళ్లగా, మరి కొంత మంది ఇంకా ఎక్కడా చేరలేదు. కాగా ఈ విషయం పై ఐటీడీఏ పీవోని కలవడానికి స్థానికులు సమాయత్తమవుతున్నారు.

అది చర్ల మండలంలోని కుర్నపల్లి పాఠశాల. అక్కడ 1నుంచి 7వ తరగతి వరకు సుమారు 100 పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఏడుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. కాగా గత నెల నుంచి జరుగుతున్న బదిలీల్లో ఉపాధ్యాయులు అందరూ బదిలీలపై వెళ్లిపోయారు. ప్రస్తుతం కొత్తగా వచ్చిన ఓ హెచ్ఎంతో పాటు, మరో ఇద్దరు (బదిలీఅయ్యింది వెళ్లలేదు) టీచర్లు పని చేస్తున్నారు. కాగా కొద్ది రోజుల నుంచి పాఠశాల నుంచి విద్యార్థులు టీసీలు తీసుకుంటున్నారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు టీసీలు తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ విషయమై గ్రామంలో తల్లిదండ్రులను, విద్యార్థులను అడగగా, టీచర్లు లేకపో వడంతో టీసీలు తీసుకున్నామని కొంత మంది. హాస్టల్స్‌లో అయితే పిల్లలు మంచిగా చదువుకుంటారని, ఇక్కడ అయితే బడికి పోవడం లేదని మరి కొంత మంది తెలిపారు. కాగా మరి కొంత మంది పూర్తి విషయం చెప్పడానికి నిరాకరించారు. కాగా కుర్నపల్లి పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం అక్కడ విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని, బడి బయట పిల్లలు లేకుండా చూడాలని గత కొంత కాలంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తోంది. కానీ ప్రస్తుతం అక్కడ విద్యార్థులు టీసీలు తీసుకోవడం, చాలా మంది ఇంకా జాయిన్ అవ్వక పోవడం నేడు చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై అధికారులు విచారణ జరిపించాల్సి ఉంది. ఇదే విషయం పాఠశాల హెచ్ఎం కె.కళ్యాణ్ చక్రవర్తిని వివరణ కోరగా, టీచర్లు లేని కారణంగా విద్యార్థులు టీసీలు తీసుకోలేదని, హాస్టల్స్‌లో మా పిల్లల్ని జాయిన్ చేస్తామని, ఇక్కడ అయితే చదవడం లేదని తల్లిదండ్రులు చెప్పడంతోనే టీసీలు ఇచ్చామని తెలిపారు. ఇదే విషయం చర్ల ఎంఈవో ఎస్. సమ్మయ్యను వివరణ కోరగా ఈవిషయం తెలియదని, వెంటనే టీచర్లను నియమిస్తామని పూర్తి వివరాలు తెలుసుకొని చర్యలు తీసుకుంటామని తెలిపారు.


కుర్నపల్లి ప్రాథమికోన్నత పాఠశాల

పునరావాసం కల్పించాలని ఆందోళన

సత్తుపల్లిరూరల్, జూలై14: ఇటీవల కురుస్తున్న భారీవర్షాలతో పాటు సమీపంలోని సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్‌ల కారణంగా దెబ్బతిన్న ఇళ్లలో ఉండలేమని, తమకు పునరావాసం క ల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఆదివారం స్థానికంగా వారు విలేకరులతో మాట్లాడుతూ సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలో ఎస్సీ కాలనీలో సుమారు 170ఇళ్లు ఉండగా, పలు ఇళ్లలో స్లాబ్ పెచ్చులూడి తమపై పడ్డాయని గ్రామస్థులు వాపోయారు. పత్తిపాటి అశోక్, నాగేంద్రమ్మ ఇంటిలో పెచ్చులూడటంతో గాయాలయ్యాయని, ఇదే క్రమంలో మిగతా ఇళ్లలోని ప్రజలు సైతం భయభ్రాంతులకు గురవుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా స్లాబ్‌లో నుంచి చెమ్మదిగడం, ఎడతెరిపి వర్షం సమయంలో కురుస్తున్నాయని, ఊసలు బయటకు రావడంతో పాటు విద్యుత్ పైపులలో నీరు చేరి ఇల్లు మొత్తం షాక్ కొడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్ కారణంగా వాతావరణంలో కాలుష్యంతో పాటు ఇళ్లన్ని దెబ్బతింటున్నాయని, తమకు పునరావాసం కల్పించాలని కాలనీవాసులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. తమకు న్యాయం చేయకపోతే పోరాటానికి సిద్ధమయ్యామని, ఆందోళనను


ఆందోళన చేస్తున్న కిష్టారం ఎస్సీ కాలనీవాసులు

ఉధ్రుతం చేస్తామని వారు తెలిపారు.

దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించిన కిష్టారం ఓసీ పీవో

దెబ్బతిన్న ఇళ్లను కిష్టారం ఓసీ పీవో ఎంపీ.నరసింహారావు పరిశీలించారు. కాలనీలో ఇళ్ల విషయమై ఉన్నతాధికారులకు తెలియజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఉడతనేని అప్పారావు, పానెం ఈశ్వర్, కొలపనేని దనుంజయ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్

» రెండేళ్ల కుమార్తెతో కలిసి బలవన్మరణానికి వ్యక్తి ప్రయత్నం » జీళ్లచెరువులో ఘటన

కూసుమంచి, జూలై 14: పాలేరు జలాశయంలో రెండేళ్ల కూతురుతో కలిసి బలవన్మరణానికి పాల్పడేందుకు యత్నించిన ఆటోడ్రైవర్‌ను కూసుమంచి పోలీస్‌కానిస్టేబుల్ కాపాడాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీళ్లచెరువు గ్రామానికి చెందిన జంపాల నరేష్ ఆటోడ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో కొంతకాలంగా భార్యాభర్తలు ఇరువురూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన అతడు, శనివారం రాత్రి తన రెండేళ్ల పాపను తీసుకుని ఆటోలో పాలేరు జలాశయం వద్దకు బలవన్మరణానికి పాల్పడేందుకు చేరుకున్నాడు. తాను.. తన కూతురుతో కలిసి బలవన్మరణానికి పాల్పడేందుకు పాలేరు జలాశయానికి చేరుకున్నట్లు 100 నెంబరుకు డయల్ చేసి చెప్పాడు. దీంతో అప్రమత్తమైన బ్లూకోర్ట్ కానిస్టేబుల్ బ్రహ్మం పాలేరు చేరుకున్నాడు. అప్పటికే నరేష్ పాపను చేతులో పట్టుకుని, తన షర్టును చింపుకుని దానికి రాళ్లు కట్టుకుకుని దాన్ని నీటిలో తేలియాడకుండా ఉండేందుకు తన కాళ్లకు


ఆటోడ్రైవర్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

కట్టుకున్నాడు. నీళ్లలోకి దూకేందుకు ప్రయత్నిస్తుండగా కానిస్టేబుల్ పట్టుకుని, కాపాడి పోలీస్ స్టేషన్‌కు తీసుకవచ్చాడు. అనంతరం నరేష్ కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి అప్పగించారు. ఈసందర్భంగా నరేష్‌ను సకాలంలో వెళ్లి కాపాడినందుకు కానిస్టేబుల్ బ్రహ్మంను పలువురు అభినందించారు.

తల్లాడలో శిశువు మృతిపై విచారణ

● బాధ్యులపై చర్యలు తీసుకుంటాం:

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సీతారాం

తల్లాడ, జూలై 14: తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రసవం సమయంలో ఆడశిశువు మృతిచెందిన సంఘటనపై సత్తుపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సీతారాం విచారణ నిర్వహించారు. ఆదివారం స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల 12వతేదీన తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన దడిపల్లి లావణ్య ప్రసవం కోసం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. పురిటినొప్పులతో రెండుగంటలపాటు లావణ్య బాధపడుతున్నప్పటికీ వైద్యసిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి ఉంటే శిశువు మృతిచెంది ఉండేది కాదని, డిప్యూటీ డీఎంహెచ్‌వో అభిప్రాయపడ్డారు. మెరుగైన వైద్యం కోసం వెంటనే ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఉంటే శిశువు ప్రాణాలతో బతికి ఉండేదని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. సాధారణ ప్రసవాలు చేయడంలో జిల్లాలో తల్లాడ పీహెచ్‌సీ ముందంజలో ఉందన్నారు. భవిష్యత్‌లో కూడా పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన వివరించారు. విచారణ సమయంలో స్టాఫ్ నర్సు కళావతి పొంతన లేని సమాధానం చెప్పడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రత్నమనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

తిరుమలాయపాలెం, జూలై14: మండలంలోని పిండిప్రోలు గ్రామ సమీపంలో నిల్వ ఉంచిన 10క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తహసీల్దార్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం పట్టుకున్నారు. పిండిప్రోలు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు రేషన్‌బియ్యం కొనుగోలు చేసి గ్రోమోర్ ఎరువుల దుకాణానికి సమీపంలో ఊరిబయట నిల్వ ఉంచారు. ఈవిషయం రెవెన్యూ అధికారులకు సమాచారం అందడంతో బియ్యాన్ని పరిశీలించగా, రేషన్ బియ్యం అని తేలింది. అవి వానకు తడిచి వాసన రావడంతో గుంటలో పూడ్చివేశారు. తనిఖీల్లో ఆర్ఐ వీరయ్య, పోలీస్ సిబ్బంది హరికృష్ణ పాల్గొన్నారు.

‘అల్పాహారం’ అందేనా ?

●సర్కార్ స్కూళ్లలో ఆదిలోనే ఆగిపోయిన ‘సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీం’

ఖమ్మం ఖానాపురం హవేలీ, జూన్ 14: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ముఖ్యమంత్రి అల్పాహార పథకం(చీఫ్ మినిస్టర్స్ బ్రేక్ ఫాస్ట్ స్కీం) ఆరంభశూరత్వంగా మిగిలిపోయింది. అసెంబ్లీ ఎన్నికల ముందు గత ప్రభుత్వం ఆర్బాటంగా ప్రారంభించిన ఈ పథకాన్ని అప్పుడే పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ఈ పథకం అమలు మూలనపడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇంతవరకు ముఖ్యమంత్రి అల్పాహర పథకంపై ఎలాంటి ఉత్తర్వులు అందకపోవటంతో ఈ ఏడాది ఈ పథకం అమలు ఉండకపోవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు ఉదయం రాగిజావ, మధ్యాహ్న భోజన సమయానికి మధ్యలో ఈ అల్పాహారాన్ని అందించేందుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలోని 1,288 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని సుమారు 80వేల మంది విద్యార్థులకు ప్రభుత్వం ఇప్పటికే మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నది. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని విద్యాశాఖ భావించింది. కానీ ప్రభుత్వం మారటంతో ముఖ్యమంత్రి అల్పాహర పథకం కొనసాగుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద మధ్యతరగతి విద్యార్థులే చదువుతుంటారు. వీరికి చదువుతో పాటు ఉచితంగా మధ్యాహ్నభోజనం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, రెండు జతల యూనిఫామ్ అందిస్తుండడంతో తల్లితండ్రులకు ఆర్థిక భారం తగ్గింది. వీటితో పాటు ముఖ్యమంత్రి అల్పాహర పథకం కూడా కొనసాగిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెరుగుతుందని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. గురుకులాల్లో, కేజీబీవీల్లో విద్యార్థులకు ఉచిత వసతి, భోజనంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్ అందింటంతో తల్లితండ్రులు ఎక్కువగా గురుకులాల వైపు మొగ్గు చూపుతున్నారని, అక్కడ సీట్లు దొరకనప్పుడే ప్రభుత్వ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారనే వాదనలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ, కోడిగుడ్లు అందించకుండానే కేవలం మధ్యాహ్న భోజనంతోనే సరిపెడుతున్నరనే విమర్శలూ ఉన్నాయి.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలి

• పీవైఎల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి రవి

మధిర, జూలై 14: భగత్‌సింగ్, చేగువేరాలను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రంలోనూ, దేశంలోనూ వేళ్లూనుకుంటున్న విష సంస్కృతులు, మత్తు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువకిషోరాలు పోరాడాలని పీవైఎల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి రవి సూచించారు. మధిరలో నిర్వహిస్తున్న పీవైఎల్ రెండు రోజుల రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. భగత్ సింగ్, చేగువేరాలు జ్వలించే కాగడాలని, వారు మరణించి వందేళ్లు అవుతున్నా వారి జీవితాల్లోని ప్రతిక్షణం స్ఫూర్తిదాయమని తెలిపారు. అతి చిన్న వయస్సులోనే వారు తమ ఆలోచనలను సమాజం వైపు మళ్లించారని పేర్కొన్నారు. సమాజం కోసం, వ్యవస్థలో మార్పు కోసం ఒక్క క్షణం కూడా ఆలోచించలేదన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని యువనాయకత్వానికి పిలుపునిచ్చారు. పాలకుల్లో స్వార్థబుద్ధి ఎక్కువైందని, నేటి యువతకు సామాజిక స్పృహను దూరం చేయడానికి అనేక విష సంస్కృతులు, మత్తు మాదక ద్రవ్యాల అలవాట్లను పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. వీటిని ఎదిరించడంలో యువనాయకత్వం కీలక పాత్ర పోషించాలని అన్నారు. యువత పెడదోవపట్టకుండా నిరోధించేందుకు కృషి చేయాలని సూచించారు.

అలాగే సోషల్ మీడియా- సమాజం అనే అంశంపై జర్నలిస్టు రాయల నాగవర్ధన్ మాట్లాడుతూ సోషల్ మీడియా రెండెంచెల పదును కలిగి ఉందన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా తర్వాత ప్రజల అభిప్రాయాలను ప్రభావితం చేయడంలో సోషల్ మీడియా అత్యంత బలమైన సాధనంగా మారిందని తెలిపారు. వీటి పట్ల యువకులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రెండు రోజులపాటు మధిరలో జరిగిన శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమాల్లో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు. కె ఎస్. ప్రదీప్, కార్యదర్శి వి. అజయ్, ఉపాధ్యక్షుడు ప్రతాప్, ఎం. రవి కుమార్, సహాయ కార్యదర్శులు ఎన్‌వీ రాజేష్, ఈశ్వర్, వాసం బుచ్చిరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు భరత్, ప్రేమ్ సింగ్, మందా సురేష్, కురసా రామకృష్ణ, బీ ఎస్ కృష్ణ, గణేష్, రంగయ్య, మోహన్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

మహిళా కండక్టర్‌పై ప్రయాణికురాలి దాడి

వైరా, జూలై 14: మహిళ కండక్టర్‌పై మహిళా ప్రయాణీకురాలు దాడిచేసిన సంఘటన ఆదివారం వైరాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలం నుంచి ఖమ్మం వస్తున్న ఆర్టీసీ బస్సులో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లుకు చెందిన సీహెచ్.అరుణ అనే మహిళా ప్రయాణీకురాలు సుజాతనగర్‌లో ఆమె భర్తతో కలిసి వైరా వచ్చేందుకు బస్సు ఎక్కారు. ఇద్దరికి భర్త టిక్కెట్ తీసుకున్నారు. చుంచుపల్లిలోని ఓ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న తమ కుమారుడి వద్దకు దంపతులు వెళ్లి వస్తున్నారు. వైరా మండలంలోని స్టేజీ పినపాక గ్రామానికి సమీపంలో ఉన్న స్కూల్లో చదువుతున్న తమ చిన్న కుమారుడి వద్దకు వెళ్లటానికిగానూ అరుణ భర్త రిక్వెస్టు మేరకు బస్సు ఆపడంతో ఆయన అక్కడ దిగి వెళ్లిపోయాడు. అయితే అరుణకు సంబంధించిన టిక్కెట్ కూడా ఆయన దగ్గరే ఉండిపోయింది. ఆమె మాత్రం బస్సులోనే వైరా వస్తుండగా, టిక్కెట్ విషయ మై భద్రాచలం ఆర్టీసీ డిపోకు చెందిన మహిళా కండక్టర్ వి జయలక్ష్మి ఆమెను ప్రశ్నించింది. ఆసమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కండక్టర్‌ను దుర్భాషలాడుతూ అరుణ దాడి చేసింది. కండక్టర్ ఫిర్యాదు మేరకు వైరా ఏఎస్ఐ వెంకటనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఐ శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

చుంచుపల్లి, జూలై14: భద్రాద్రి జిల్లాలోని అశ్వారావుపేట ఎస్ఐ ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబానికి తోటి ఉద్యోగులు అండగా నిలిచి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆదివారం మృతుడు ఎస్ఐ స్వగ్రామం నారక్కపేటలో ఎస్ఐ సతీమణికి ఆర్థిక సాయంగా రూ.25 లక్షల చెక్కును అందజేశారు. 2014 సంవత్సరానికి చెందిన ఏ.పీ - తెలంగాణ ఎస్ఐ వెల్ఫేర్ బ్యాచ్‌మేట్స్ ఆధ్వర్యంలో తోటి ఉద్యోగులు ముందుకురావడం పట్ల పలువురు అభినందించారు.


శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న 2014 బ్యాచ్ ఉద్యోగులు

గుట్కాప్యాకెట్ల పట్టివేత

ఇల్లెందు టౌన్, జూలై 14: ఇల్లెందు పట్టణంలోని ప్రధాన రహదారిచర్చి ఎదురుగా ఉన్న ఓ కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన గుట్కా ప్యాకెట్లను ఆదివారం ఇల్లెందు పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణ కిరాణం ఫ్యాన్సీ షాపులో తనిఖీ చేయగా దుకాణంలో దొరికిన గుట్కా, విమల్ ప్యాకెట్లు సుమారు రూ.15వేల విలువ ఉంటుందని తెలిపారు. కిరాణ షాపు యజమాని భరత్ పై కేసు నమోదు చేసి గుట్కాప్యాకెట్లను సీజ్ చేసినట్లు సీఐ ప్రకటించారు.

నాటుకోళ్లు మృతి

లక్ష్మీదేవిపల్లి, జూలై 14 : మండల పరిధిలోని తిప్పగుట్ట గ్రామంలో ఆకస్మికంగా నాటుకోళ్లు, వాటి పిల్లలు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. ఎప్పటి లాగే కోళ్లను ఉదయం విడిచిపెట్టారు. మేతకు వెళ్లిన కోళ్లకు బియ్యం గింజలు తిన్న కోళ్లు అక్కడికక్కడే ఉన్నట్లుండి మృత్యువాత పడ్డాయి. మరికొన్ని అస్వస్థతకు గురయ్యాయి. సుమారు 30 పై చిలుకు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. కొందరు కావాలనే బియ్యం గింజల్లో పంట పొలాలకు వాడే క్రిమిసంహారక మందును వేసి చంపినట్లు వారు ఆరోపిస్తూ లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఈ విషయం పై పోలీసులు ఆరా తీస్తున్నారు.


మృత్యువాతపడ్డ కోళ్లు

రామాలయంలో సుదర్శన హోమం



భద్రాచలం, జూలై 14: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఆదివారం సుదర్శన హోమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రతి నెలా చిత్తా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి సుదర్శన హోమం నిర్వహించడం అనాధిగా వస్తున్న సంప్రదాయం. అందులో భాగంగా ముందుగా సుదర్శన పెరుమాళ్లను యాగశాల ప్రాంగణంలోకి తీసుకొచ్చి ఆసీనులను చేశారు. అనంతరం ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, సుదర్శన కలశ స్థాపన, సుదర్శన హవనం, పూర్ణాహుతి, ఆశీర్వచనం నిర్వహించారు. సుదర్శనస్వామికి ప్రసాద నివేదన చేసి భక్తులకు పంపిణీ చేశారు. అదేవిధంగా స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహిచారు. అదేవిధంగా స్వామి వారికి ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన, నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

- ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి
- కొత్తగూడెం రైల్వే స్టేషన్ పరిశీలన
- ఘనస్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు
- రద్దైన రైళ్లను పునరుద్ధరిస్తానని హామీ



కొత్తగూడెం రైల్వే స్టేషన్ పరిసరాలలో వివరాలు పర్యవేక్షిస్తున్న ఎంపీ రఘురామ్‌రెడ్డి, తదితరులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 14: ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డికి కొత్తగూడెంలో ఘన స్వాగతం ఆదివారం పలికారు. ఎంపీ హోదాలో తొలిసారి కొత్తగూడెం చేరుకున్న ఎంపీ రఘురాంరెడ్డికి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు రైల్వే అధికారులు, రైల్వే స్టేషన్ ప్రాంగణంలో గజ మాల వేసి సాధర స్వాగతం పలికారు. అనంతరం కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్) రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను అధికారులు కలిసి పరిశీలించారు. ఆ నిర్మాణాలకు సంబంధించిన వివరాలు రైల్వే అధికారులు ఎంపీకి వివరించారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రయాణికులకు ఎటువంటి ఆటంకం కల్పించవద్దు అని, పనులను త్వరతిగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా గతంలో రైల్వే స్టేషన్ నుంచి రద్దు అయినా ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. వాటికి సంబంధించిన నివేధికను సిద్ధం చేయాలని పార్లమెంట్ సమావేశంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రైళ్ళు నడిచేలా చర్యలు చేపట్టాలని కోరుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ విశ్వనాధ్, రైల్వే అధికారులు రాంభజన్‌వీణ, పాషా, రాజారెడ్డి, ఎండీ ఇర్ఫాన్, ఎంఙ జావద్, జేమ్స్‌పాల్, కాజా బాబా, భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళీ, కోనేరు సత్యనారాయణ, గోపాలరావు, గుగులోత్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంత ఎస్సీలకు రిజర్వేషన్ అమలు చేయాలి

రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల రిజర్వేషన్‌ను 20 శాతం పెంచాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మర శ్రీనివాస్ ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డికి వినతిపత్రం ఆదివారం అందజేశారు. పాలన సౌలభ్యం కోసం ఏర్పడ్డ రాష్ట్రంలో సగం భూభాగం వెనుకబడ్డ ఏజెన్సీ ప్రాంతంగా ఉందన్నారు. అభివృద్ధిలో వెనుక బడిన ఎస్సీ కులాల స్థానిక రిజర్వేషన్ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో తొలిగించిన స్థానిక ఎస్సీ కులాల స్థానిక రిజర్వేషన్ తిరిగి అమలు చేయాలన్నారు. ఎస్సీ కులాల విద్య, ఉద్యోగ, ఉపాధి రాజకీయ పరంగా ఆదుకోవాలని కోరారు. ప్రజా పాలన ఇందిరమ్మ రాజ్యంలో ఎస్సీ కులాల అభివృద్ధి జరుగుతుందని ధీమ వ్యక్తం చేశారు. వీరి వెంట జేఏసీ కో-కన్వీనర్ రజనీర్, అంబేద్కర్, కమిటీ సభ్యులు కండె రాములు, సలిగంటి కొమరయ్య, ఏలేటి వెంకటేశ్వర్లుపాల్గొన్నారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న ఎంపీ

పాల్వంచ రూరల్: పాల్వంచ మండలంలోని కేపీజగన్నాధపురంలో గల పెద్దమ్మతల్లి ఆలయాన్ని తొలిసారిగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఎంపీకి సాంప్రదాయబద్ధంగా ఆహ్వానించారు. గర్భగుడిలోకి తీసుకెళ్లి వేదపండితులు మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని పూజలుచేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఈవో రజినికుమారి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి మోటార్లను ఏర్పాటుచేయాలి

ఎంపీకి 24వ వార్డు కౌన్సిలర్ వినతి

లక్ష్మీదేవిపల్లి, జూలై 14: మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో తాగునీటి ఎద్దడి అధికంగా ఉందని ఇందు కోసం రూ.2లక్షలతో మిని వాటర్ స్కీంను ఏర్పాటైనప్పటికీ మోటారును ఏర్పాటు చేయడంలో జరుగుతున్న జాప్యాన్ని తొలగించి తాగునీటి సమస్యను తీర్చాలని కోరుతూ ఎంపీ రఘురాంరెడ్డికి ఆదివారం 24వ వార్డు కౌన్సిలర్ బాలిశెట్టి సత్యభామ వినతిపత్రం అందజేశారు. కొందరు కావాలని కాంట్రాక్టర్‌ను బెదిరింపులకు పాల్పడుతూ మోటారును బిగించకుండ అడ్డుపడుతున్నారని అధికారులు జోక్యం చేసుకుని మోటారు బిగించి మంచినీటి సమస్యను తీర్చాలని కోరారు. వినతిపత్రం అందచేసిన వారిలో స్థానికులు బాలిశెట్టి సుందర్‌రాజు, శంకర్ తదితరులు ఉన్నారు.

సింగరేణి సమస్యలపై ఎంపీకి వినతి

కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నెలకొన్న సమస్యలపై ఎంపీ రామసహాయం రఘురామరెడ్డికి సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందచేశారు. ఆదివారం కొత్తగూడెంలో ఆయనకు స్వాగతం పలికారు. మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఎంపీని ఆ సంఘం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కలిసి సమస్యలపై విన్నవించారు. ఈకే 7 ఇంక్లైన్ క్యాస్ట్‌గానికి అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని, జీకేఓసీపీ గనికి ఎక్స్టన్షన్ అనుమతులు మంజూరీ చేయించాలని, ఇల్లెందు రొంపేడు ఓసీకి అటవీ శాఖ ద్వార త్వరగా పర్యావరణ అనమతులు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్. మధుసూధన్‌రావు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూముల నుంచి గెంటేస్తున్నారు

- భూమి లేకుంటే ఆత్మహత్య చేసుకుంటాం
- ఇల్లెందు మండలం బొంబాయితండాలో

అటవీ అధికారులపై గిరిజన దంపతుల ఆరోపణ



పట్టా భూములు స్వాధీనం చేసుకుంటున్నారంటూ వాపోతున్న గిరిజనులు

ఇల్లెందు, జూలై 14: ప్రభుత్వం జారీ చేసిన పట్టాలు ఉన్నప్పటికి పోడు భూములను ఫారెస్టు అధికారులు దౌర్జన్యంగా స్వాధీనం చేసుకుంటున్నారని తనకున్న రెండు ఎకరాల భూమి నుంచి తనను గెంటి వేశారని తమకు భూమి లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమని బానోత్ సునీత, బానోత్ వెంకటేశ్వర్లు అనే గిరిజన దంపతులు వాపోయారు. ఇల్లెందు మండలం పోలారం గ్రామపంచాయతీలోని బొంబాయి తండాకు చెందిన వీరు తమ రెండు ఎకరాల భూమిని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకొని మొక్కలు నాటుతున్నారని కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆదివారం విలేకర్లకు తెలిపారు. బాధితుల కథనం ప్రకారం బొంబాయి తండాకు చెందిన బానోత్ సునీత పేరిట రెండు ఎకరాల పోడు భూమికి గత ప్రభుత్వం పట్టా జారీ చేసింది. ఫలితంగా రైతు బంధుతో పాటు పంట రుణాలు సైతం పొందుతున్నారు. అయితే సునీత కుటుంబాన్ని సాగు చేయనియకుండా ఫారెస్టు అధికారులు అడ్డు పడుతున్నారని వారసత్వంగా లభించినా భూమికి పట్టా ఉన్నప్పటికి దౌర్జన్యంగా అధికారులు మొక్కలు నాటుతూ ప్లాంటేషన్లు వేస్తున్నారని పేర్కొన్నారు. శుక్రవారం తమ భూమి నుంచి బీట్ ఆఫీసర్ శ్రీవిద్య, సెక్షన్ ఆఫీసర్ సురేష్ తమపై కేసులు పెడతామని బెదిరిస్తూ సాగు భూమిలోకి రానివ్వకుండా మొక్కలు నాటారని, దౌర్జన్యం చేశారని ఆరోపించారు. 5 దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూమిని ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకుంటే తమకు చావే శరణ్యమ ని విలపించారు. గిరిజనుల పట్టాల భూములను స్వాధీనం చేసుకోవడాన్ని నిలిపివేయాలని బొంబాయి తండా పంచాయతీ మాజీ సర్పంచ్ వాంకుడోత్ సరోజ, గ్రామస్థులు భూక్య శంకర్, దారావత్ దేవ్‌జ, భూక్య సురేష్ తదితరలు కోరారు. కాగా తాము నిబంధనల మేరకే కోర్టు ఆదేశాల ప్రకారం ట్రెంచ్ పరిధిలోని భూముల్లో అడవులు పెంచేందుకు మొక్కలు నాటుతున్నామని బీట్ ఆఫీసర్ శ్రీవిద్య తెలిపారు. తమ విధులకు అడ్డుపడుతూ తమను దుర్భషలాడుతూ మరో వైపు తమపై నిందారోపణలు చేయడం సరైంది కాదని వివరించారు. తాను ఉద్యోగ విధుల్లో భాగంగా మొక్కలు నాటుతున్నట్లు వివరించారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి..

దమ్మపేట, జూలై 14: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని టీఎస్‌యుటి ఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ రాష్ట్రప్రభుత్వాన్నీ డిమాండ్ చేసారు. దమ్మపేటలో ఆదివారం ఆసంఘం సమావేశం జరిగింది. ఈసమావేశంలో రమేష్‌కుమార్ మాట్లాడుతు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఉపాధ్యాయులకు పదోన్నతలు, బదిలీలు చేయటం పట్ల రాష్ట్రప్రభుత్వాన్ని అభినందించి కృతజ్ఞతులు తెలిపారు. ఇదే ప్రకియలో బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులను సత్వరమే రిలీవ్ చేసి వారి స్థానంలో తాత్కాలిక ఉపాధ్యాయులను సర్ధుబాటు చేయాలని కోరారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అదేవిధంగా పీఎస్ హెచ్‌ఎం పోస్టులను బీఈడీ కలిగిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు కూడా పదోన్నతలు కల్పించి భర్తీ చేయాలని కోరారు. ఈసమావేశంలో మండల ప్రధానకార్యదర్శీ రామారావు, సీహెచ్ కనకదుర్గ, జె.సురేష్. వినోద్, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న 23వ వార్డు ప్రజల తాగునీటి కష్టాలు

కొత్తగూడెం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం మున్సిపాలిటీ 23వ వార్డు కూలీలైన్‌లో కుమ్మరివాడ ఏరియా, లక్ష్మి దుర్గ స్వీట్ కొట్టు ఏరియాల్లో మున్సిపాలిటీ నిధుల నుంచి తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన నూతన బోర్లలో కరెంట్‌మోటార్లు, పైపులైన్లు, పబ్లిక్ ట్యాప్‌లు ఆదివారం ఏర్పాటు చేసి స్విచ్ఆన్ చేసి నీళ్లను ట్రైలెరస్ ద్వారా వాటర్‌ను పంపింగ్ చేశారు. కౌన్సిలర్ వై. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కూనంనేని, కలెక్టర్, మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక కృషితో తాగునీటి పరిష్కారం కోసం నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. వార్డు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డిని వార్డు ప్రజలు అభినందించారు.



మంచినీటిని పట్టుకుంటున్న మహిళలు

ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలి: ఎస్ఐ

జూలూరుపాడు, జూలై 14: ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని, ఆటోలలో మహిళలు ఉన్న సమయంలో చెడు ఘటనలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జూలూరుపాడు ఎస్ఐ రాణాప్రతాప్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలిస్‌స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధిచిన పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, సిబ్బంది సురేష్, రామకృష్ణ, కుటుంబరావు పాల్గొన్నారు.

గోదావరి జలాల తరలింపు అన్యాయం

దుమ్ముగూడెం, జూలై 14: భద్రాద్రి జిల్లాలోని ఏ ఒక్క మండలానికి సాగునీరివ్వకుండా సీతారామప్రాజెక్టు ద్వారా పక్క జిల్లాలకు గోదావరి జలాల తరలింపు అన్యాయమని సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ చర్ల, దుమ్ముగూడెం మండలాల సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ అన్నారు. లక్ష్మీనగరంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ఒక్క ఎకరాకు నీరివ్వకుండా, ప్రక్క జిల్లాకు నీరు తరలించడంపై జిల్లాలోని ముగ్గురు మంత్రులు ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. పాత డిజైన్లు మార్చి కొత్త డిజైన్లతో ఏజన్సీ ప్రాంతానికి అన్యాయం చేశారని ఆరోపించారు. రోళ్లపాడు రిజర్వాయర్ నిర్మిస్తే జిల్లాతోపాటు పక్క జిల్లాలకు కూడా న్యాయం జరిగేదని తెలిపారు. సమ్మక్క, సీత, లక్ష్మీదేవి, అజయ్, రాజు పాల్గొన్నారు.

19న శ్రీవారాహి అమ్మవారి పూజలు

అశ్వారావుపేట, జూలై 14: అశ్వారావుపేట పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ఆవరణలో ఈనెల 19న శ్రీవారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ ముత్తా సుమాకర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆషాడమాసం శు క్రవారం పురస్కరించుకొని ఆలయంలో 19వ తేదీన శ్రీవారాహి అమ్మవారి అష్టోత్తర కుంకుమార్చన, 108 మంది సుమంగళిలచే అష్టోత్తర కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించబడతాయని ఆయన తెలిపారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో కొత్వాల ప్రత్యేక పూజలు

పాల్వంచ రూరల్, జూలై 14: మండలంలోని కేపీజగన్నాథపురంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధిపై అధికారులతో మాట్లాడారు. దేవస్థానం అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో రజినికుమారి, మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, మాజీ దేవస్థానం చైర్మన్ మహిపతి రామలింగం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొండ వెంకన్న, డైరెక్టర్లు ఎస్‌వీఆర్‌కే. ఆచార్యులు, చింతా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బదిలీలను తక్షణమే ఆపివేయాలి: టీబీజీకేఎస్

మణుగూరుటౌన్, జూలై 14: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పనిచేస్తోన్న జనరల్ మజ్దూర్ల అక్రమ బదిలీలను తక్షణమే నిలిపివేయాలని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023లో యాజమాన్యమే కేపీయుజీ నంద సర్వేస్‌లో పనిచేసేందుకు మజ్దూర్‌లను బదిలీ చేసిందని, ఆ సమయంలో మజ్దూర్‌లు అంగీకరించి రిపోర్టు చేశారన్నారు. ఇప్పుడు మరల జనరల్ మజ్దూర్‌ల బదిలీల్లో కొందరిని పీకేఓసీ-2 గని బదిలీ చేయడం సరికాదన్నారు. ఇప్పటికే కేపీయూజీ గనిలో సుమారు 161 మంది డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారని, ఇప్పుడు ఇలా ఇష్టానుసారంగా మజ్దూర్‌లను బదిలీ చేయడం వలన వర్కర్లు మానసికంగా కృంగిపోతున్నారన్నారు. యాజమాన్యం పురోగతిని దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని, కక్ష్య పూరితమైన పనులు మానుకోవాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మణుగూరుటౌన్, జూలై 14: మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సుమారు రూ.2.5 లక్షల విలువైన 9 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పీరినాకి నవీన్, కూచిపూడి బాబు, రహంపాషా, సురేష్, శివ, చింతల కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అట్టడుగున ఆదివాసీలు

- నాలుగు రాష్ట్రాల ఆదివాసీల సమావేశంలో ప్రతినిధులు

భద్రాచలం, జూలై 14: నేటి సమాజంలో ఆదివాసీలు అభివృద్ధి సూచికలో అట్టడుగున ఉన్నారని పలువురు ఆదివాసీ ప్రతినిధులు వాపోయారు. దీంతో ఆదివాసీలు తమ అస్తిత్వాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. భద్రాచలంలో రెండు రోజులపాటు తెలంగాణ, ఆంధ్రప దేశ్, చత్తీశ్‌గడ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ నాయకులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో చర్చించిన కీలక అంశాలు, డిమాండ్లను మీడియాకు ఓ లేక విడుదల చేశారు. ఆదివాసీలు అభివృద్ధి చెందకుండా సమాజం అభివృద్ధి చెందినట్లు కాదని వారు స్పష్టంచేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులకు అందజేస్తున్న రిజర్వేషన్లు ప్రభుత్వ పథకాలు వారి దరిచేరకపోవటం, నకిలీ ధృవీకరణ పత్రాలతో ప్రభుత్వా ఉద్యోగాలు, బినామీ పేర్లతో సంక్షేమ పథకాలు దళారులు కాజేస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరుల దోపిడిని అక్రమ చొరబాట్లను అరికట్టేందుకు అనేక చట్టాలు చేసినా అవి అమలు చేయకపోవటం వలన ఆదివాసులు నష్టపోతున్నారన్నారు. పెసా చట్టాన్ని ప్రభుత్వమే చేసినా దానిని అధికారలుఉ అమలుచేయడం లేదన్నారు. రాష్ట్రంలోని షెడ్యూల్ ప్రాంతాలు, షెడ్యూల్ కాని ప్రాంతాలన్నింటినీ కలిపి షెడ్యూల్ జిల్లాలుగా ఏర్పాటుచేసి ఆదివాసులకు స్వయం నిర్ణయాధికారాల హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పెసా చట్టం 1996లోని సెక్షన్ 4(0)లో పేర్కొన్న విధంగా రాష్ట్రంలో కూడా ఆరవ షెడ్యూల్ తరహా స్వయంపాలిత జిల్లా, మండళ్లు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ విరుద్ధంగా ఎస్టీ జాబితాలో చేర్చిన లంబాడీలను తొలగించేందుకు ప్రజా ఉద్యమాలతో ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు. ఇప్పటికే అనేక సంఘాలు, సంస్థలు ఉన్నా అవి ఏదో ఒక రాజకీయపార్టీకి అనుబంధంగా ఆదివాసీల ఓట్లకోసం పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఆదివాసీలకు ఏదో చేస్తామని, ఇస్తామని వచ్చి కొంతమంది ఆశ చూపిస్తున్నారని ఆచరణలో అది ఏమాత్రం అమలుకావటంలేదని వాపోయారు. ఈ సమావేశంలో ఆదివాసీ సీనియర్ నాయకులు మడకం వెంకటేశ్వర్లు, మడి సాయిబాబు, కొమరం అనిల్‌కుమార్, ఊకే.రవి, వర్సా నరేష్, పీర్ల బాస్కర్, కుంజా ప్రసాద్, వజ్జా జ్యోతిబసు, కనితి రాధా, బేబి, నాగమణి తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

మణుగూరుటౌన్, జూలై 14: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా వైద్య విభాగం, సేవా సమతిల ఆధ్వర్యంలో రాజుపేట గ్రామంలో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సింగరేణి సంస్థ సామాజిక బాధ్యతలో బాగంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సింగరేణి ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శేషగిరి తెలిపారు. పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా గ్రామస్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది టీ సురేష్, వెంకటరమణయ్య, రూపా, రవి, నందిని, కే రవి, కో ఆర్డినేటర్ మారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

బూర్గంపాడు, జూలై 14: బూర్గంపాడు మండల పరిదిలోని మోరంపల్లిబంజర గ్రామంలో ఆదివారం పొంగులేటి స్వరాజ్యం రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్(పీఎస్ఆర్) ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భద్రాచలంలోని కిమ్స్ హస్పిటల్ సౌజన్యంతో మోరంపల్లిబంజర గ్రామంలోని జిల్లా ఉన్న పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిభిరంలో పలు గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య సేవలను పొందారు. శిబిరంలో భాగంగా రోగులను పరీక్షించి మందులను అందజేశారు. కార్యక్రమంలో హస్పిటల్ మేనేజ్‌మెంట్ భీమ్‌రెడ్డి బాబురెడ్డి, చావా శివరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రాత్రి పది దాటితే ఓన్లీ పోలీసింగ్

- కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 14: రాత్రి పది గంటలు దాటితే ఓన్లీ పోలిసింగ్ మాత్రమే ఉంటుందని శాంతి భద్రతలను కాపాడడంతో ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండదని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ ఆదివారం సూచించారు. కొత్తగూడెం, చుంచుపల్లి సర్కిల్, జూలూరుపాడు సర్కిల్, కొత్తగూడెం వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఇది అమలు జరుగుతుందన్నారు. అదేవిధంగా బహిరంగంగా మద్య సేవించడం, బర్త్ డే తదితర వేడుకలను నిర్వహించడం పూర్తిగా నిషేధం అన్నారు. కొత్తగూడెం పోలీస్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా ప్రధాన సెంటర్‌లలో, తదితర వీధుల్లో నలుగురు కంటే ఎక్కువ మంది ఉన్న వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. గంజాయి రవాణా, భద్రపరిచే వారు, సేవించే వారిపై ఉక్కు పాదం మోపుతామని స్పష్టం చేశారు. ఆకతాయల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక పోలీస్ బలగాలను ఏర్పాటు చేసి బృందాలుగా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. వాహన తనిఖీలను ముమ్మరం చేస్తామని పోలీస్ అధికారులకు వాహన యజమానులు సహకరించాలని కోరారు. మైనర్ డ్రైవింగ్‌కు ఎవరైన పాల్పడితే వాహన యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, అనవసర తగాదాలలో తలదూర్చితే వారిపై పీడీయాక్ట్‌ను నమోదు చేసి చర్యలు తీసుకుంటామని అన్నారు. ముఖ్యంగా గంజాయి రవాణాలో నెంబర్ ప్లేట్లు లేని ద్విచక్రవాహనాలతో పాటు, కార్లు ఉంటున్నాయని, అలాంటి వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. నెంబర్ ప్లేట్లు లేని, సరిగా లేని వాహనాలను సీజ్ చేస్తామని అన్నారు. వాహన దారులు డ్రైవింగ్ లైసెన్సు తో పాటు, వాహన ధృవపత్రాలు అన్ని తమ వెంట ఉంచుకోవాలన్నారు. ఏదైనా ప్రాంతాలలో అసాంఘీక కార్యక్రమాలు జరుగుతున్నాయని ప్రజల దృష్టికి వస్తే పోలీసులకు కానీ డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

ముగిసిన వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

సుజాతనగర్, జూలై 14: శ్రీ వారాహి అమ్మవారి నవ రాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిసాయి. సుజాతనగర్‌లోని వేముల అంజిబాబు ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 6 నుంచి 14 వరకు ఘనంగా నిర్వహించారు. ఈ వారాహి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి 9 రోజుల పాటు ధూప, దీప నైవేద్యాలతో, పండితుల వేద మంత్రోచ్చారణల మద్య నిత్యపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం చివరి రోజైన ఆదివారం భక్తులకు అన్నదాన సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

రేపు 3వ విడత సామాజిక తనిఖీ

- అధికారులు తప్పని సరిగా హాజరుకావాలి
- ఇన్‌చార్జ్ ఎంపీడీవో కుమార్

కరకగూడెం, జూలై 14: మండలంలోని సమత్ భట్టుపల్లి పంచాయతీలోని రైతు వేదికలో మంగళవారం 3వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో కుమార్ తెలిపారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1-4-2023 సంవత్సరం నుంచి 31-3-2024 వరకు మండలంలోని 16 పంచాయతీలలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాజిక తనిఖీ కార్యక్రమంకు 16 ఉదయం 10గంటలకు జరుగుతుందని మండలంలోని అన్ని పంచాయితీల కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లు ప్రజా ప్రతినిధులు, ఉపాధిహామీ కూలీలు సకాలంలో హాజరుకావాలని తెలిపారు.

రూ.30లక్షల విలువైన భూమి వితరణ

చర్ల, జులై 14: చర్లలోని వనవాసీ కల్యాణ పరిషత్ కార్యాలయానికి చర్లకు చెందిన జవ్వాది కోదండ రాంబాబు, సుమతిరాం దంపతులు ఆదివారం సుమారు రూ.30 లక్షలు విలువ చేసే 10 సెంట్ల స్థలాన్ని వితరణగా అందజేశారు. చర్ల మండలంలో వనవాసీ కళ్యాణ పరిషత్ ఏర్పాటు చేసి ఆదివాసీ విద్యార్థులకు వెరుగైన విద్య, వసతి అందిస్తున్నారు. అనేక మంది విద్యార్థులకు తోడ్పాటు కల్పిస్తున్నారు. దీంతో పేదవిద్యార్థులకు తమవంతు సాయం అందించాలనే లక్ష్యంతో చర్లకు చెందిన జవ్వాది కుటుంబ సభ్యులు కోదండ రాంబాబు అతని తల్లిదండ్రులు జవ్వాధి నారాయణ మూర్తి, జయలక్ష్మి జ్ఞాపకార్థం 10 సెంట్ల భూమిని వితరణగా అందజేశారు. రాంబాబు మాట్లాడుతూ, పేద విద్యార్థులకోసం భూమి వితరణగా ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాగా భూమి హక్కు పత్రాలు జవ్వాధి రవికుమార్ చేతుల మీదుగా అందజేశారు. కార్యాక్రమంలో జవ్వా. ది కుటుంబ సభ్యులు మురళికృష్ణ, వనవాసీ సభ్యులు ఉన్నారు.

గణేష్ టెంపుల్‌లో స్వర్ణదుర్గా దేవి అమ్మవారికి శాకంబరి అలంకరణ

కొత్తగూడెం సాంస్కృతికం, జూలై 14: ఆషాడమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం కొత్తగూడెంలోని శ్రీ విజయవిఘ్నేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ స్వర్ణదుర్గ దేవి అమ్మవారికి శాకంబరి దేవీ అలంకరణ చేసి భక్తులకు దర్శనం గావించారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఫలాలు, పూలమాలలతో మూల విరాట్‌కు శాఖాంబరి దేవతగా విశేష అలంకరణ చేశారు. ఈ అలంకరణలో అమ్మవారు పాడిపంటలు సంవృద్ధిగా కలుగ చేస్తుందని భక్తుల విశ్వాసం. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తన్మయత్వం చెందారు. అనంతరం తీర్థ ప్రసాదాలు సమర్పించారు. ఆలయ ఈవో సులోచన, అర్చకులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

గోటి తలంబ్రాల వరి విత్తనాలకు పూజలు


- భూపాలపల్లి నుంచి భక్తుల రాక




పూజలు నిర్వహించిన వడ్లను అందజేస్తున్న దేవస్థానం సిబ్బంది

భద్రాచలం, జూలై 14: భూపాలపల్లి జిల్లా చెల్పూరు గ్రామస్థులు రామదాసు తిరుపతయ్య-తిరుపతమ్మ దంపతులు తమ వ్యవసాయ క్షేత్రంలో పండించి 2025లో జరిగే శ్రీ సీతారాముల కల్యాణానికి సమర్పించే గోటి తలంబ్రాల వడ్లకు ఆదివారం రామాలయంలో తిరుపతయ్య-తిరుపతమ్మలు వడ్లను స్వామి వారి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజించిన వడ్లను తమ వ్యవసాయ క్షేత్రంలో నాటి వరి విత్తనాలుగా మారిన అనంతరం 2025లో జరిగే స్వామి వారి కల్యాణంనాటికి దేవస్థానంకు శ్రీరామదాసు భక్త మండలి జయశంకర్ జిల్లా తరపున అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, కత్తి శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఘనంగా ఆషాఢ బోనాల వేడుకలు





అశ్వారావుపేటలో బోనాలతో ఆలయానికి బయలుదేరిన మహిళలు, జూలూరుపాడు మండలం పాపకొల్లులో..

అశ్వారావుపేట రూరల్, జూలై 14: మండలంలోని నారాయణపురంలో ఆదివారం బోనాల వేడుకలను అత్యంత వేడుకగా నిర్వహించారు. వందలాదిగా తరలివచ్చిన మహిళలతో గ్రామంలో పండువ వాతావరణం నెలకొంది. బోనాల వేడుక సందర్భంగా గ్రామంలో భక్తిభావం వెల్లివిరిసింది. బోనాల వేడుక సందర్భంగా ఉదయం ముత్యాలమ్మకు నీళ్లు పోసే కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు బారులు తీరి అమ్మవారికి నీళ్లపోశారు. ముత్యాలమ్మకు వివిధ రకాల పూజలను నిర్వహించారు. అనంతరం మేళతాళాల నడుమ మహిళలు బోనాలతో బయలుదేరి వేలేరుపాడు మార్గంలోని కట్టమైసమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం వద్ద కట్టమైసమ్మకి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి బోనాలను సమర్పించారు.నిర్వాహకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కోలాహలంగా అమ్మవారి ఆలయాలు

మండలంలోని వినాయకపురంలో గల ప్రసిద్ధ చిలకలగండి ముత్యాలమ్మ, గోగులపుడి సమీపంలోని గుబ్బల మంగమ్మ ఆలయాలు ఆదివారం భక్తులతో కోలాహలంగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో అటవీప్రాంతం సందడిగా మారింది. ఆలయాల్లో ఉదయం అమ్మవార్లకు వివిధ రకాల పూజలు నిర్వహించారు. భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

పాపకొల్లులో ఘనంగా బోనాల ఉత్సవాలు

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామంలో ఆషాడమాసం బోనాల కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించి గ్రామదేవత నాభిశిల వద్ద ప్రత్యేక పూజలు చేసి కోటమైసమ్మ తల్లి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి అమ్మ వారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పండి గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.